ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 75 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | శుక్రవారం 21 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 75 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | FRI 21 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ముగిసిన జగన్ విచారణ

## ఆరేళ్ల తర్వాత నాంపల్లి సీబీఐ కోర్టుకు..



- అక్రమాస్తుల కేసులో విచారణ ఎదుర్కొంటున్న మాజీ సీఎం
- హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరిన జగన్
- సాధ్యం కాదన్న సీబీఐ కోర్టు
- ప్రతి విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం
- మరోసారి విచారణను వాయిదా వేసిన న్యాయమూర్తి
- నిమిషాల వ్యవధిలోనే ముగిసిన విచారణ... సీబీఐ కోర్టు నుంచి లోటస్ పాండ్ కు చేరుకున్న జగన్
- అక్రమాస్తుల కేసులో సీబీఐ కోర్టుకు హాజరైన వైఎస్ జగన్
- ఏ1గా పిలవగానే కోర్టు హాల్లోకి వెళ్లి సంతకం చేసిన వైనం
- విచారణ అనంతరం లోటస్ పాండ్ నివాసానికి తిరుగుపయనం

**పెన్ పవర్ డెస్క్:**ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత జగన్ హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ప్రాంగణంలోకి వెళ్లిన తర్వాత జగన్ తొలుత వెయిటింగ్ గదిలోకి వెళ్లారు. విచారణ ప్రారంభం కాగానే, కోర్టు సిబ్బంది 'ఏ1 వైఎస్ జగన్మోహన్ రెడ్డి' అని పిలిచారు. వెంటనే ఆయన కోర్టు హాల్లోకి ప్రవేశించి, న్యాయమూర్తికి నమస్కరించారు. అనంతరం, న్యాయమూర్తి సూచన మేరకు హాజరు పట్టికలో సంతకం చేశారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే జగన్‌ను కోర్టు నుంచి వెళ్లేందుకు జడ్జి అనుమతించారు. విచారణ సందర్భంగా జగన్ ను జడ్జి ఎలాంటి ప్రశ్నలు అడగలేదు. కేవలం ఆయన హాజరును మాత్రమే జడ్జి పరిగణనలోకి తీసుకుని, సంతకం చేయించుకుని పంపించి వేశారు. రాబోయే రోజుల్లో పిటిషన్లపై విచారణ జరగనుంది.

కాగా, ఈ కేసులో జగన్ తదుపరి విచారణకు ఎప్పుడు హాజరు కావాలనే అంశంపై న్యాయస్థానం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు, కోర్టు నుంచి బయటకు వచ్చిన జగన్, నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసమైన లోటస్ పాండ్‌కు వెళ్లారు. లోటస్ పాండ్ వద్దకు అప్పటికే పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు చేరుకున్నాయి. లోటస్ పాండ్ లోకి కేవలం కొద్ది మంది కీలక నేతలు మాత్రమే వెళ్లారు. వీరితో జగన్ గంటన్నర



పాటు చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు సమాచారం. తెలంగాణకు చెందిన వైసీపీ కీలక నేతలు కూడా జగన్ ను కలవనున్నారు. హైదరాబాద్ నుంచి జగన్ బెంగళూరుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు, మీడియాతో జగన్ మాట్లాడతారా? అనే అంశంపై ఆసక్తి నెలకొంది.



# మావోయిస్టుల రహిత రాష్ట్రంగా ఏపీ

- దేవ్ జి తదితరులు తమ కస్టడీలో లేరు
- లొంగిపోతే పునరావాసం
- రెండు రోజుల్లో 13 మంది ఎన్కౌంటర్ 50 మంది అరెస్ట్
- ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుంది
- రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా

**అల్లూరి జిల్లా ప్రతినిధి, పెన్ పవర్, నవంబర్ 20:**కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిజిపి హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.మారేడుమిల్లి లో మావోయిస్టుల - పోలీసుల ఎదురుకాల్పుల నేపథ్యంలో ఆయన గురువారం అల్లూరి జిల్లా రంపచోడవరం లో పర్యటించారు.ఆంధ్రప్రదేశ్ పోలీస్

వివరాలు 2లో..



# చేయడానికి పనులు ఉండవు, డబ్బుకు విలువ పోతుంది

## ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు



- భవిష్యత్తులో ఉద్యోగాలు ఆప్షనల్ అవుతాయన్న ఎలాన్ మస్క్
- ఏఐ, రోబోల వల్ల డబ్బుకు కూడా విలువ ఉండదని కీలక వ్యాఖ్యలు
- పేదరికాన్ని ఏఐ, హ్యూమనాయిడ్ రోబోలు పూర్తిగా రూపుమాపుతాయని జోస్యం

వివరాలు 2లో..

# కేంద్రంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఫైర్



- కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా చట్టాలు తేవడంపై అసహనం
- పార్లమెంట్ కు ఆ అధికారం లేదన్న చీఫ్ జస్టిస్
- ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టాన్ని తప్పుబట్టిన సీజేఐ

పెన్ పవర్ డెస్క్:కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడాన్ని అత్యున్నత న్యాయ స్థానం తప్పుబట్టింది. కోర్టు తీర్పులను పక్కనబెట్టే అధికారం పార్లమెంట్ కు లేదని పేర్కొంది. ఈమేరకు 2021 లో

వివరాలు 2లో..

# ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్...

## హాజరైన మోదీ, చంద్రబాబు

- పాట్నాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం
- నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం
- సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు



వివరాలు 2లో..

# బిహార్ ఎన్నికల్లో ఓటమి.. ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం

- ఎన్నికల్లో ఓటమి... మౌన దీక్ష చేపట్టిన ప్రశాంత్ కిశోర్
- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ మౌన దీక్ష
- పశ్చిమ చంపారన్‌లోని గాంధీ ఆశ్రమంలో ఒక రోజు పాటు దీక్ష
- మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి దీక్ష ప్రారంభం
- మూడేళ్ల క్రితం ఇదే ప్రాంతం నుంచి పాదయాత్ర మొదలుపెట్టిన పీకే



వివరాలు 2లో..

# గతేడాది 31 కోట్ల మంది మహిళలపై లైంగిక దాడులు!

- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు హింసకు బాధితులే
- రెండు దశాబ్దాలుగా హింస నివారణలో పురోగతి నామమాత్రం
- భాగస్వామి చేతిలో 1.25 కోట్ల మంది బాలికలు హింసకు గురి



**పెన్ పవర్ డెస్క్:**మహిళలపై హింస ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లం ఘనగా కొనసాగుతోందని, ఈ సమస్య పరిష్కారంలో గత రెండు దశాబ్దాలుగా చెప్పుకోదగ్గ పురోగతి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. నవంబర్ 25న అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విడుదల చేసిన నివేదికలో అనేక దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించింది.గడిచిన 12 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 31.6 కోట్ల మంది మహిళలు, 1.25 కోట్ల మంది కౌమార బాలికలు లైంగిక హింసకు గురయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు (దాదాపు 84 కోట్ల మంది) తమ జీవితకాలంలో భాగస్వామి ద్వారా గానీ, ఇతరుల వల్ల గానీ హింసను ఎదుర్కొన్నారని, 2000 సంవత్సరం నుంచి ఈ సంఖ్యలో పెద్దగా మార్పు లేదని నివేదిక పేర్కొంది.15-19 ఏళ్ల వయసున్న బాలికల్లో 16 శాతం మంది (1.25 కోట్లు) తమ భాగస్వామి చేతిలో శారీరక లేదా లైంగిక హింసకు గురైనట్లు తేలింది. భాగస్వామి

వివరాలు 2లో..

# విద్యార్థుల చేతిలోనే భవిష్యత్తు, కష్టపడితేనే విజయం మీ సొంతం

- విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చన్న నారా భువనేశ్వరి
- 2వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో నారా భువనేశ్వరి
- కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసిన భువనేశ్వరి
- విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణం

వివరాలు 2లో..



# సీబీఐ కోర్టులో జగన్, సునీత.. ఎదురుపడ్డా మాటల్లేవ్, పలకరింపుల్లేవ్!

- నాంపల్లి సీబీఐ కోర్టులో ఎదురుపడిన జగన్, సునీత
- అక్రమాస్తుల కేసు విచారణకు హాజరైన జగన్
- వివేకా హత్య కేసు పిటిషన్‌పై విచారణకు వచ్చిన సునీత



**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ సునీత, అక్రమాస్తుల కేసు విచారణ నిమిత్తం వైసీపీ అధినేత ఒకే సమయంలో కోర్టుకు హాజరయ్యారు. అయితే, కోర్టు ప్రాంగణంలో ఎదురుపడినప్పటికీ జగన్ తన సోదరి సునీతను పలకరించకుండానే వెళ్లిపోవడం గమనార్హం.వివరాల్లోకి వెళితే, వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తును కొనసాగించాలన్న

వివరాలు 2లో..

# ఈ నెల 24 నుంచి రైతన్నా,మీకోసం

## 10 వేలమందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- వ్యవసాయంలో పంచ సూత్రాలపై ఏడు రోజులపాటు కార్యక్రమాలు
- అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకువద్దామని పిలుపు
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# రప్పా.. రప్పా.. మార్మోగిన హైదరాబాద్!

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి హైదరాబాద్ పర్యటన తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అక్రమాస్తుల కేసులో కోర్టు వాయిదాకు వచ్చిన జగన్ కు స్వాగతం పలికేందుకు ఆ పార్టీ కార్యకర్తలు ఉత్సాహం చూపారు. వారి అభిమానాన్ని ఎవరూ కాదనకపోయినా, కొందరు అత్యుత్సాహంతో '2029లో రప్పా.. రప్పా' అంటూ పోస్టర్లు ప్రదర్శించడమే అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. కోర్టుకు వచ్చిన సమయంలో ఇలాంటి పోస్టర్లు ప్రదర్శించి ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.కొద్ది నెలల క్రితం జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లె పర్యటనకు వెళ్లిన సమయంలో ఈ రప్పా.. రప్పా కటౌట్లు దర్శనమిచ్చాయి. తాము మళ్లీ అధికారంలోకి వస్తే టీడీపీ కార్యకర్తలను 'రప్పా.. రప్పా' నరికేస్తాం అంటూ పోస్టర్ ప్రదర్శించిన ఓ వైసీపీ కార్యకర్తను పోలీసులు అప్పట్లో అరెస్టు చేశారు. ఇక ఈ తరహా బెదిరింపు రాజకీయాలే వైసీపీ మానటం లేదని టీడీపీ సోషల్ మీడియా తీవ్ర విమర్శలు గుప్పించింది. అయితే ఈ విషయంలో స్పందించిన జగన్ 'రప్పా.. రప్పా' అనేది సినిమా డైలాగ్ కదా? సినిమా డైలాగులు చెప్పినా తప్పే అంటారా? అంటూ అప్పట్లో వెనకేసుకొచ్చారు.ఇక అప్పటి నుంచి జగన్ ఎక్కడికి వెళ్లినా రప్పా.. రప్పా డైలాగులు ఉన్న పోస్టర్లే జగన్మోహనరెడ్డికి స్వాగతం పలుకుతున్నాయి. చివరికి హైదరాబాదులో కోర్టుకు వచ్చిన సందర్భంలోనూ అవే పోస్టర్లను ప్రదర్శించడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే కార్యకర్తలు అత్యుత్సాహంతో చేస్తున్న ఈ ప్రదర్శన పార్టీకి నష్టం చేస్తుందని కొందరు సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు. సీనియర్ నేత మాజీ మంత్రి అంబటి రాంబాబు సైతం ఈ రప్పా రప్పా డైలాగులను గతంలో ఒకసారి తప్పుబట్టారు. ఆయన మీడియాతో మాట్లాడుతుండగా, ఓ కార్యకర్త రప్పా రప్పా నినాదాలు చేయడాన్ని ఆయన వారించారు.ఈ పరిస్థితుల్లో రప్పా.. రప్పాయే వైసీపీ ఎన్నికల నినాదంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు అధికార కూటమి వైసీపీ 'రప్పా.. రప్పా' నినాదాలుపై తీవ్రంగా స్పందిస్తోంది. అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తామని చెప్పకుండా.. రప్పా.. రప్పా అంటూ బెదిరింపులేంటి అంటూ ప్రశ్నిస్తోంది. అయితే ఈ విషయంలో వైసీపీ అధినేత జగన్ ఆలోచన ఏంటీ అన్నది అంతుచిక్కడం లేదని అంటున్నారు. పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపడానికి ఆయనే ఈ తరహా ప్రచారాన్ని కోరుకుంటున్నారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ద

# విద్యార్థుల చేతిలోనే భవిష్యత్తు, కష్టపడితేనే విజయం మీ సొంతం

క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం మన సొంతమవుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకమైందని, చిన్నతనం నుంచే పిల్లలకు విలువలు నేర్పించాలని అన్నారు. 2వ రోజు కుప్పం నియోజక వర్గం పర్యటనలో భాగంగా పరమ సముద్రం గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటించారు.కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలలను సందర్శించారు. కేజీబీవీ నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణించారు. అనంతరం సామగుట్టపల్లిలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు.

**విజయానికి షార్ట్ కట్ లేదు**

"పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది. ఆటపాటలతో పాటు కెరీర్‌పై కూడా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కష్టపడకుండా విజయం రాదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు. ఎన్టీఆర్, అబ్దుల్ కలామ్, ధీరూభాయ్ అంబానీ, చంద్రబాబు వంటి వారంతా ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. చంద్రబాబు గారు చిన్నతనంలో 6 కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవారు. నాకు తల్లిదండ్రులే స్ఫూర్తి. మా నాన్నగారు ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి చదువుకునే వారు. ఎంతోమంది తల్లిదండ్రులు స్తోమత లేకపోయినా వారి శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు నారా భువనేశ్వరి సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు సహాయం చేయటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కస్తూర్బా విద్యాలయానికి 20 కంప్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని" నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు.

**పిల్లలను విలువలతో పెంచాలి**

"విలువల బడి వ్యవస్థాపకులు లెనిన్ గారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత నేర్పించి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడులను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. నా చిన్నతనంలో స్కూల్లో మోరల్ సైన్స్ ఒక సబ్జెక్ట్ గా ఉండేది. ఇప్పుడు మళ్లీ పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్ తీసుకొచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు నా అభినందనలు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పష్టన్న క్విజ్ అనే బోర్డులు పెట్టడం చాలా సంతోషదాయకం. నేటి సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయి. టెక్నాలజీని చెడు కోసం ఉపయోగిస్తున్నారు. పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమైంది. చిన్నతనంలోనే విలువలు, సంస్కారం నేర్పాలి. పిల్లల ఆసక్తి గమనించి అందులో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. నారా లోకేశ్ ప్రజాసేవలో బిజీగా ఉండటంతో మా మనుమడు దేవాన్ష్ చదువు, క్రీడల విషయాలను బ్రాహ్మణినే స్వయంగా చూసుకుంటుంది. అప్పట్లో చంద్రబాబు గారు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో లోకేశ్ పెంపకం బాధ్యత తానే తీసుకున్నాను"ని నారా భువనేశ్వరి తెలిపారు.

# ఈ నెల 24 నుంచి రైతన్నా,మీకోసం

వ్యవసాయ రంగంలో సమూల మార్పుల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలికాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు గ్రామస్థాయిలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి 'మీకోసం రైతన్నా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనున్నారు.

ఈ సందర్భంగా టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "గత 7 నెలలుగా రైతులను, వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకు చెల్లించాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపట్టాం. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతులకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని పేర్కొన్నారు.

**ప్రకృతి సేద్యం: అగ్రిటెక్ విధానాలతో కలిగే లాభాలు వివరించాలి**

రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా అధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నామని, రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని అన్నారు. కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించానని, ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉందని అన్నారు. "రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు, వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రియ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమగ్ర నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేయడానికి పనులు ఉండవు, డబ్బుకు విలువ పోతుంది

ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ, హ్యూమనాయిడ్ రోబోల విస్తృతితో భవిష్యత్తులో ఉద్యోగాలు చేయడం అనేది కేవలం ఒక ఐచ్ఛికం (ఆప్షనల్)గా మారుతుందని, డబ్బుకు కూడా పెద్దగా ప్రాధాన్యత ఉండదని జోస్యం చెప్పారు. వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్-సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ కూడా పాల్గొన్నారు.రాబోయే పది, ఇరవై ఏళ్లలో మనుషులు చేయడానికి పనులేమీ ఉండవని మస్క్ అన్నారు. "భవిష్యత్తులో చాలా పనులు ఆప్షనల్‌గా మారతాయి. ఇప్పుడు మనం క్రీడలు లేదా వీడియో గేమ్స్‌ను ఎలా ఆడుతున్నామో, రేపు ఉద్యోగం కూడా అలాగే ఉంటుంది. అవసరం కోసం కాకుండా కేవలం అభిరుచిని బట్టి పనులు చేసే రోజులు రానున్నాయి" అని మస్క్ వివరించారు.

ఏఐ, రోబోటిక్స్ పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తాయని ఆయన గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. పేదరికం ఒక సామాజిక సమస్య కాదని, అదొక ఇంజినీరింగ్ సమస్య అని అభివర్ణించారు.

"ఏఐ, రోబోటిక్స్ ప్రాథమిక వస్తువులు, సేవల ఖర్చులను గణనీయంగా తగ్గిస్తాయి. తద్వారా పేదరికం అంతమవుతుంది. ఏఐ, హ్యూమనాయిడ్ రోబోలు అందరినీ ధనవంతులుగా మారుస్తాయి" అని ఆయన పేర్కొన్నారు. హ్యూమనాయిడ్ రోబోల తయారీలో టెస్లా అగ్రగామిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే వేదికపై ఉన్న ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ మాట్లాడుతూ.. ఏఐ వల్ల ఉద్యోగాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని అంగీకరించారు.

# కేంద్రంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రిబ్యునళ్ల సంస్కరణ చట్టంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ ట్రిబ్యునల్‌తో పాటు పలు ట్రిబ్యునళ్లు రద్దయ్యాయని మద్రాస్ బార్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రిబ్యునళ్ల సంస్కరణ చట్టం అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో న్యాయస్థానం కొట్టివేసిన చట్టాలను.. వాటి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసి కొత్త చట్టాలు తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కోరగా.. సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసు ప్రాధాన్యతను బట్టి అవసరమైతే తామే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తామని చెప్పారు.

దీంతో ప్రభుత్వ న్యాయవాది విచారణకు వాయిదా కోరగా సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ పొందే వరకూ ఈ కేసులో తీర్పు రావద్దని కోరుకుంటున్నారా?' అంటూ ప్రభుత్వ న్యాయవాదిని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పులను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంటూ.. ట్రిబ్యునళ్ల సంస్కరణ 2021 చట్టంలోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీర్పు వెలువరించారు.

# గతేడాది 31 కోట్ల మంది మహిళలపై లైంగిక దాడులు!

- మొదటి పేజీ తరువాయి

ద్వారా జరిగే హింసను తగ్గించడంలో పురోగతి చాలా నెమ్మదిగా ఉందని, గత 20 ఏళ్లలో ఏటా కేవలం 0.2 శాతం మాత్రమే తగ్గిందని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. భాగస్వాములు కాకుండా ఇతరుల వల్ల 15 ఏళ్ల వయసు నుంచి 26.3 కోట్ల మంది మహిళలు లైంగిక హింసకు గురయ్యారని, అయితే సామాజిక అపవాదు, భయం కారణంగా కొందరు వెల్లడించరని, దాని వల్ల ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు."మహిళలపై హింస మానవాళి ఎదుర్కొంటున్న పురాతన, విస్తృతమైన అన్యాయాలలో ఒకటి. అయినా దీనిపై చర్యలు చాలా తక్కువగా ఉన్నాయి. జనాభాలో సగం మంది భయంతో జీవిస్తున్న ఏ సమాజాన్నీ సురక్షితమైనదిగా పిలవలేం" అని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్-జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, నివారణ కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని, బాధితులకు అండగా నిలిచే వ్యవస్థలను బలోపేతం చేయాలని నివేదిక పిలుపునిచ్చింది.

# మావోయిస్టుల రహిత రాష్ట్రంగా ఏపీ

- మొదటి పేజీ తరువాయి

శాఖ గత రెండు రోజులుగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో నడుపుతున్న 'ఆపరేషన్ సంభవ్'లో భారీ విజయం సాధించినట్టు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీశ్ కుమార్ గుప్తా పత్రికా ముఖంగా వివరించారు. ఆపరేషన్ నేపథ్యాన్ని గమనిచేందుకు ఆయన హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరంపత్రికా సమావేశంలో మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ సమయంలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో 13 మంది నక్సలైట్లు హతమైనట్టు వివరించారు. మరణించినవారిలో ప్రముఖ మావోయిస్టు నాయకుడు హిడ్మ, టెక్ శంకర్ కూడా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ చర్యతో భారీగా రాష్ట్రవ్యాప్తంగా 50 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్టు కూడా ప్రకటించారు.ఈ విజయం అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు , రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం యొక్క సమన్వయ ప్రయత్నాల ఫలితమని డీజీపీ స్పష్టం చేశారు. ఈ జాయింట్ ఆపరేషన్లో పోలీసులు నక్సలైట్ల నుండి భారీ సంఖ్యలో ఆయుధాలు, బుల్లెట్స్, పేలుడు పదార్థాలు, ప్రచార సామగ్రిని రికవరీ చేయడంలో విజయం సాధించారు. ఈ స్వాధీనం వలన నక్సల్ సంస్థకు తీవ్రమైన నష్టం కలిగినట్టు పోలీసులు భావిస్తున్నారు అని తెలిపారు. గత జూన్ నెలలో జరిగిన ఎన్కౌంటర్ సందర్భంలో కూడా నక్సలైట్లకు భారీ నష్టం జరిగినప్పటికీ, పోలీసులు వారిని లొంగిపోవాలని ఆహ్వానించినా, ఆ మార్గంలో వారు అడుగు పెట్టడానికి నిరాకరించారనిగత సంఘటనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తిరిగి మావోయిస్టులను లొంగిపోవాలని కోరారు. తమ హింసా మార్గాన్ని వదిలి, జనజీవన స్రవంతిలో కలిసి రావాలని ఆహ్వానించారు, వారి సాధారణ జీవితం గడపడానికి పోలీస్ శాఖ, ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారు స్పష్టం చేసారు.రాష్ట్రాన్ని పూర్తిగా నక్సల్ రహితంగా మార్చడమే ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ యొక్క అంతిమ లక్ష్యమని డీజీపీ పునరుద్ఘాటించారు. ఈ లక్ష్యం సాధించడం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ఎటువంటి అంతరాయాలు లేకుండా సాఫీగా జరగవచ్చని ఆయన అన్నారు.ఈ ఆపరేషన్ యొక్క విజయానికి కీలకమైన భూమిక పోషించిన అన్ని పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు వారికి విలువైన సమాచారం అందించి సహకరించిన ప్రజలకు డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సంభవ్ ఇంకా పూర్తి కాలేదు మరియు అది మరింత తీవ్రంగా కొనసాగుతుంది. నక్సలిజం వైపు చూపుతున్న ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకునే లక్ష్యంతో ఈ చర్యలు కొనసాగబడతాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం నక్సల్ నాయకులు దేవ్ జీ , మల్ల రాజారెడ్డి పోలీస్ అదుపులో లేరని కూడా ధృవపరిచారు. ఈ ఆపరేషన్ విజయం రాష్ట్ర భద్రతా దిశగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ యొక్క దృఢ నిబద్ధతకు సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. రాష్ట్రం యొక్క సురక్షిత భవిష్యత్తు సమగ్ర అభివృద్ధి కోసం నక్సలిజం వంటి అంతరాయ శక్తుల మీద దాడులను పోలీస్ శాఖ దీర్ఘకాలిక వ్యూహం భాగంగా కొనసాగించనుంది అని స్పష్టం చేసారు.

# సీబీఐ కోర్టులో జగన్, సునీత.. ఎదురుపడ్డా మాటల్లేవ్, పలకరింపుల్లేవ్!

- మొదటి పేజీ తరువాయి

పిటిషన్ల విచారణ కోసం సునీత కోర్టుకు వచ్చారు. అదే సమయంలో, తనపై ఉన్న అక్రమాస్తుల కేసు విచారణలో భాగంగా జగన్ కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో కోర్టులో సునీతను చూసినప్పటికీ, జగన్ ఆమెతో మాట్లాడకుండా, పలకరించకుండానే ముందుకు సాగిపోయారు.ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కీలక వ్యక్తులు, వేర్వేరు కేసుల నిమిత్తం ఒకేసారి కోర్టుకు రావడం, కనీసం పలకరించుకోకపోవడం అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచింది. వివేకా హత్య కేసులో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, బాబాయ్ కుమార్తెను జగన్ పలకరించకపోవడం రాజకీయంగానూ చర్చనీయాంశంగా మారింది.

# బిహార్ ఎన్నికల్లో ఓటమి.. ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం

బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోయింది. ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు. ప్రధాని మోదీ, ఎన్డీయే నాయకుల సమక్షంలో నీతీశ్ కుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ప్రశాంత్ కిశోర్ ఈ వ్రతం చేపట్టడం గమనార్హం. ఇటీవల ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పరాజయానికి 100 శాతం బాధ్యత తనదేనన్నారు. తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఈ క్రమంలోనే ఒకరోజు మౌనవ్రతం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన ప్రకారం.. తాజాగా భితిహర్వా గాంధీ ఆశ్రమంలో ఈ మౌనవ్రతాన్ని చేపట్టారు. ఇది ఈరోజు మొత్తం కొనసాగుతుందని పార్టీ తెలిపింది. ఇక, ఇటీవల ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ.. అధికార కూటమిపై ప్రశాంత్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలో 60వేల మంది లబ్ధిదారులకు నీతీశ్ ప్రభుత్వం రూ.10వేలు చొప్పున ఇవ్వకుంటే ఆ పార్టీ 25 స్థానాలకే పరిమితమయ్యేదన్నారు. ఓట్లు పొందకపోవడం నేరం కాదని, అయితే.. అవినీతి, విభజన రాజకీయాలు మాత్రం తాను చేయలేదని అధికార పక్షాన్ని ఉద్దేశిస్తూ విమర్శించారు.ఇక, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 సీట్లకు గాను.. 202 సీట్లు దక్కించుకుని ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. నేడు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు.

# ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్...

జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది.నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

# మంత్రి నారాయణతో ఎమ్మెల్యే జనార్దన్ భేటీ

**– అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, అవినీతి పరులపై విజిలెన్స్ విచారణ జరపాలని వినతి**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలుపెన్ పవర్ నవంబర్ 20**

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ని బుధవారం సచివాలయంలోని వారి కార్యాలయంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కలిశారు. ఒంగోలు నగరంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు కు, పోతురాజు కాలువ,నల్ల వాగు కాలువ అభివృద్ధికి నిధులు



మంజూరు గురించి ప్రతిపాదనలు అందజేశారు. మెప్మా లో జరిగిన అవినీతి పై లోతైన విజిలెన్స్ ఎంక్వయిరీ వేయాలని కోరారు. మునిసిపల్ కార్పొరేషన్ కి రావలిసిన నిధులు సుమారు రూ. 79 కోట్లు.. కాంట్రాక్టర్లకు రావలిసిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దామచర్ల మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు.

పెన్ పవర్
ప్రకాశం

# పేదల సొంతింటి కల నిజం చేస్తున్నాం



## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

### కందుకూరు అర్బన్ పరిధిలో 417 ఇళ్లు మంజూరు

### రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 20:**

పేదల సొంతింటి కలలు నిజం చేయటంలో భాగంగా, కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లు మంజూరు చేస్తోందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు అర్బన్ పరిధిలో 417 మందికి ప్రభుత్వం తరఫున ఇళ్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన సాంక్షన్ ఉత్తర్వులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని బృందావనం, కోటారెడ్డి నగర్ 1,2 సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కే. అనూష, హౌసింగ్ ఈఈ మాధవరావు, డి ఈ నారాయణ, తహసిల్దార్ లావణ్యతో కలిసి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో పేదల కోసం టిడ్కో ఇళ్లను కట్టించిన సంగతిని గుర్తు చేశారు. కందుకూరు పట్టణంలో 1400 కుటుంబాలు, టిడ్కో ఇళ్లల్లో కాపురం ఉంటున్నారని చెప్పారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం కనీసం 10 శాతం పనులు పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఊరికి దూరంగా వాగులు, వంకల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వైసిపి హయాంలో నిర్మించిన కాలనీ ఇళ్లకు బిల్లులు మధ్యలో ఆపేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని , సొంత స్థలాలు ఉండి ఇల్లు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఏవైనా సమస్యలు ఉంటే, వారికి అన్యాయం జరగకుండా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సొంతగా స్థలాలు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అవసరమైతే ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని నాగేశ్వరరావు తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత చంద్రబాబు నాయుడు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఈ ఇంటూరి సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విద్యాశాఖ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాస్ రావు, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, కల్లూరి శైలజ, మహర్షి శ్రీను, చనమాల శ్రీధర్, పాలేటి కోటేశ్వరరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, గడ్డం మాలకొండయ్య, కూనం నరేంద్ర, ముచ్చు వేణు, గుమ్మా శివ, మంచిరాజు మురళి, మేడ మల్లికార్జున, చుండూరి శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, అత్తోట మాల్యాద్రి, మురారి శెట్టి వెంకట సుధీర్, షేక్ రూబీ, జియావుద్దీన్, అన్ని వార్డు అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# ఘరానా మోసగాడు తోట బాలాజీ నాయుడు అరెస్ట్

*వివరాలు వెల్లడించిన మార్కాపురం డి యస్ పి, యు, నాగరాజు*



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 20**

రాయితీ రుణాలు ఇప్పిస్తానంటూ రాజకీయ నాయకుల,ప్రజల వద్ద భారీగా డబ్బులు దండుకున్న ఘరానా మోస గాడిని యర్రగొండపాలెం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు . ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మండలంలో అయ్యంబొట్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మాదాల సూర్యనారాయణకు,పిఎం ఆన్ ఎంప్లాయిమెంట్ రిసోర్స్ కింద రాయితీ రుణం మంజూరు అయిందని తన పేరు సంజయ్ కుమార్ అని మోసపు మాటలు చెప్పిన ముద్దాయి తోట బాలాజీ నాయుడు మాటలు నమ్మిన బాధితుడు సూర్యనారాయణ,రూ.1,29000 వేలు బాలాజీ నాయుడు ఖాతాకు పంపించాడు. ముద్దాయికి ఫోన్ చేస్తే ఇంకా కొంత నగదు ఇవ్వాలని సూర్య నారాయణను పలుమార్లు అడుగుతుండగా మోసపోయానని గ్రహించిన సూర్య నారాయణ యర్రగొండపాలెం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసిన పోలీసులు బాధితునితో మరికొందరి ద్వారా నగదు అందజేస్తానని నమ్మబలికి చాకచక్యంగా కేసును ఛేదించి గురువారం నాడు స్థానిక పుల్లలచెరువు రోడ్డులో నిందితుడు బాలాజీ నాయుడును తీసుకున్నారు గతంలో ముద్దాయి బాలాజీ నాయుడు ఎన్టీపీఎస్ లో ఇంజనీర్ గా పని చేస్తూ 2009 లో ఏసీబీ,సిబిఐ కేసుల్లో సస్పెండ్ అయి మూడు సంవత్సరాలు జైలు శిక్ష కూడా అనుభవం చాడని తెలిపారు.అప్పటి నుండి రాజకీయ నాయకులను, ఎమ్మెల్యేలను సైతం టార్గెట్ చేస్తూ రాయితీ రుణాలు, ఇప్పిస్తానంటూ ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్రల్లో సుమారు 50 మంది వద్ద నుండి మోసం చేసి వారి వద్ద డబ్బు తీసుకున్నాడని విచారణలో తేలిందని అన్నారు.ముద్దాయి బాలాజీ నాయుడుపై ఇప్పటికే రెండు రాష్ట్రాలలో 32 స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని,చర్లపల్లి జైలులో శిక్ష కూడా పడిందని తెలిపారు.జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత కూడా అతని తీరు మార్చుకోలేదని, తిరిగి రాజకీయ నాయకులను మోసం చేయటమే లక్ష్యంగా పెట్టుకొని ఆక్రమణలకు పాల్పడుతూ మోసపూరితంగా ప్రజల ప్రజల నుండి నగదు వసూలు చేశారన్నారు. మోసం చేసి సంపాదించిన డబ్బును అతను ఆరోగ్యం, కుటుంబ అవసరాలకు ఉపయోగించే వాడని చెప్పారు. బాధితుడు సూర్య నారాయణ వద్ద తీసుకున్న రూ.1.29000 రికవరీ చేసినట్లు తెలిపారు.అలాగే మరో కేసులో ముద్దాయి బాలాజీ నాయుడు వద్ద ఉన్న రూ.31 వేలు డబ్బులు అతని సొంత ఖర్చులకు వాడుకున్నట్లు తెలిపారు.ముద్దాయి బాలాజీ నాయుడును కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.ఇటువంటి వ్యక్తుల పట్ల నాయకులు,ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐ కె అజయ్ కుమార్,ఎస్సై పి చౌడయ్య మరియు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలు జ్ఞాన సుగంధాలు

*- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ*

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 20**

చినిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో అని సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం చెప్పిన మాటను గుర్తుచేసి పుస్తకం జ్ఞానాన్ని పెంపొందిస్తుందని జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇంచార్జ్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆర్. గోపాలకృష్ణ రోణంకి చెప్పారు. ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు 58వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవ వేడుకలలో చివరి రోజు బుధవారం ముగింపు వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇంచార్జ్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆర్. గోపాలకృష్ణ రోణంకి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారు విద్యార్థినీ విద్యార్థులకు కొన్ని సలహాలు సూచనలు ఇచ్చారు. వారంలో ఒక్కరోజు అయినా గ్రంథాలయాన్ని సందర్శించి ఏదో ఒక ఆక్టివిటీని అలవర్చుకోవాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. సెల్ ఫోన్ కు దూరంగా ఉండి వార్తాపత్రికలను పుస్తకాలను





చదవడం అలాగే మీ కలలను డెవలప్ చేసుకోవాలని, నచ్చిన కళలు సంగీతము నృత్యము డ్రాయింగ్ పెయింటింగ్ మొదలగునవి డెవలప్ చేసుకుని ఒక్క చదువుకే ప్రాధాన్యత ఇవ్వకుండా కళ లను కూడా ప్రోత్సహిస్తూ ముందుకు వెళ్ళాలని గమ్యాన్ని సూచించారు. ఈ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. వారం రోజులపాటు జరిగినటువంటి పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జీ కార్యదర్శి జీవి శివారెడ్డి, ఇన్చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కె సంపూర్ణమ్మ , సందీప్ అనిల్ ,శివకుమారి, గోవిందమ్మ , కార్యాలయ సిబ్బంది సాంసన్, కృష్ణవేణి ,మృదుల్ కుమార్, గ్రంథాలయ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి

# 100 రోజులు జైలు శిక్ష

**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 20**

మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో షేక్ షరీఫ్ అనే వ్యక్తికి 100 రోజులు జైలు శిక్ష 15,000 జరిమానా విధిస్తూ గిద్దలూరు ఏజెఎఫ్సిఎం కోర్టు న్యాయమూర్తి భరత్ చంద్ర గురువారం తీర్పు చెప్పినట్లు గిద్దలూరు అర్బన్ సీఐ కే సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సురేష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వస్తుందని, అందువల్ల వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపటం మంచిది కాదని హితవు పలికారు.



## శత మానం భవతి ఐ ఐ టి రామయ్యకు మాంటిస్సోరి ప్రకాశ్ శుభాకాంక్షలు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 20**

ప్రముఖ విద్యావేత్త మాజీ శాసనమండలి సభ్యులు ఐఐటీ రామయ్య చుక్కా రామయ్య 100 వ పుట్టినరోజు సందర్భంగా మాంటిస్సోరి ప్రకాష్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రామయ్య తనకు దైవసమానులని మాంటిస్సోరి స్కూల్ భవనాన్ని వారి చేతులమీదుగానే ప్రారంభించానని తనను పుత్రవాల్సల్యంతో చూసేవారని గుర్తు చేసుకున్నారు. వారి 100 వ పుట్టిన రోజున వారిని కలవడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని ప్రకాష్ తెలియచేసారు. రామయ్య ను కలిసిన వారిలో బొమ్మల శ్రీనివాస రావు, కొప్పోలు భీమేశ్వరావు వున్నారు.

## సామాజిక మాధ్యమాలపై అవగాహన ర్యాలీ




**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 20**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం 2025 లో భాగంగా సామాజిక మాధ్యమాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గురువారం కళాశాల ఆవరణంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో కలిసి ప్లకార్డ్స్ చూపిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ యువతలో సోషల్ మీడియా పట్ల పెరుగుతున్న వ్యసనం మరియు సమాజంపై చూపుతున్న ప్రభావంపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు పోకుండా, మంచి విషయాల కోసం మరియు సమాజ శ్రేయస్సు కోసం సోషల్ మీడియాను ఉపయోగించాలని కోరారు. ఈ ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## కాల భైరవ స్వామి పూజలు నిర్వహించిన శిద్దా లక్ష్మి పద్మావతి





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 20**

శ్రీ స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి ఒంగోలు వారి ప్రథమ వార్షిక మహోత్సవం ఒంగోలు మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి,శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి , ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా సూర్యప్రకాశరావు, జయశ్రీ దంపతులు హాజరై శ్రీ స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం శిద్ధా లక్ష్మీ పద్మావతి చే ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా కాలభైరవ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వచ్చిన ముఖ్య అతిథులకు శ్రీ స్వర్ణాకర్షణ కాలభైరవ కమిటీ సభ్యులు ఈ కాలభైరవ చిత్రపటాలను అందజేశారు. అనంతరం సుమారుగా 400 మందికి అన్న ప్రసాద వితరణ వచ్చిన ఆదిత్య అతిథులుచే లక్ష్మీ పద్మావతి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో గాయత్రి మందిర సెక్రటరీ తూనుగుంట మల్లికార్జునరావు, మందిర వైస్ ప్రెసిడెంట్ పివి శేఖర్, ఆలపాటి సీతారామయ్య, గాయత్రి మందిర కమిటీ సభ్యులు, శిద్దా వెంకట ప్రసాద్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన గ్రంథాలయ వార్షికోత్సవాలు

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 20**

గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 58వ గ్రంథాలయ జాతీయ వార్షికోత్సవాలు గురువారం వెలిగండ్లలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి. గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు నేతృత్వంలో వారం రోజుల పాటు వివిధ సాహితీ, సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మండల ప్రాథమిక పాఠశాల, శ్రీ సాయి వికాస్ స్కూలు, శ్రీకృష్ణ అప్పర్ ప్రైమరీ స్కూలు విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ చాటుకుని మెరిశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాదు మాట్లాడుతూ అవసరమైన పుస్తకాలు, జ్ఞానం కోసం ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్నే ఆశ్రయించాలని ఎంఈఓ ప్రసాద్ సూచించారు. "పుస్తకాలు మనకు మంచి గురువులు. ప్రతిరోజు గ్రంథాలయానికి వెళ్లే అలవాటు చేసుకోవాలని సూచించారు గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి చాలామంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని మీరు కూడా గ్రంథాలయంలోని విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయి చేరుకోవాలని





ఆకాంక్షించారు ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ నవంబర్ 14న ప్రారంభించడం జరిగిందని ఈరోజు ముగింపు సభ నిర్వహించామని అన్నారు వార్షికోత్సవాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు చురుకగా స్పందించినందుకు సంతోషంగా ఉందని గ్రంథాలయాలపై మమకారం పెరిగేలా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు తదుపరి ఎంఈఓ ప్రసాదు ను ఘనంగా సన్మానించారు విజయోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ సుశీల, కొండమ్మ, స్కూల్ టీచర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం తగదు




**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 20**

పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామంలో రైతులు గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టి తమ సమస్యలను బహిర్గతం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయం కష్టాల్లో ఉండకూడదనే ఉద్దేశంతో పగటి పూట 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికి మర్రివేముల గ్రామంలో మాత్రం విద్యుత్ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పాటించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు సమయానికి, సరిపడే విద్యుత్ ఇవ్వకపోవడంతో పంటల సాగు తీవ్రంగా దెబ్బతింటోందని, బావులు, మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాల్సిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వల్లే రైతులు అనవసర సమస్యలు ఎదుర్కొంటున్నారని రైతులు ఆరోపించారు.విద్యుత్ సరఫరా లోపాల వలన పంట కాలం నష్టపోక ముందే సమస్యను పరిష్కరించాలని, గ్రామానికి తక్షణమే స్థిరమైన విద్యుత్ సరఫరా అందించాలని వారు డిమాండ్ చేశారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు వెనుకాడబోమన్నారు.రైతుల ఆందోళనతో సబ్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. గ్రామానికి వెంటనే క్రమబద్ధమైన విద్యుత్ ఇవ్వాలని రైతులు కోరుతూ ఆందోళన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిన్న కండ్లేరు చెరువుపై చర్యలు తీసుకోవాలి...

## *రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్*

**పుల్లలచెరువు పెన్ పవర్ నవంబర్ 20**

పుల్లలచెరువు మండలానికి జీవనాడిగా నిలిచే చిన్నకండ్లేరు చెరువు ఎడమ కాలువలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న లీకేజీ రైతుల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తోంది. చెరువుల్లో నీరు నిల్వ ఉండాల్సిన సమయంలో రోజుల తరబడి లీకేజీ కారణంగా నీటిమట్టం పడిపోతోందని, చెరువు కట్ట బలహీనపడే ప్రమాదం ఉందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బృందం పుల్లలచెరువు చిన్నకండ్లేరు లీకేజీ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పురోగమనం పేరుతో ఏ ప్రభుత్వం వచ్చినా చెరువుల పరిరక్షణపై సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువు కట్టకు గండి పడినప్పుడు అప్పటి మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ కొంతపాటి పూడ్చే పనులు చేపట్టినప్పటికీ అవి ఫలితం ఇవ్వకపోవడంతో లీకేజీ సమస్య యథాతథంగా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాధ్యతలో ఉన్న నేపథ్యంలో వెంటనే జోక్యం చేసుకుని చెరువు కట్టను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు కట్ట బలహీనత కొనసాగితే కింది తెల్లగట్లతో పాటు పరిసర గ్రామాలు ప్రమాదంలో పడే అవకాశముండటంతో రైతులు గండిపడే భయంతో రాత్రింబవళ్లు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. టీ%--%5 కాలువకు అనుబంధంగా ఉన్న ఈ చెరువు ఒక టీఎంసీ సామర్థ్యం కలిగి ఉండగా, భూగర్భ జలాల పెరుగుదలకు ప్రధాన ఆధారంగా నిలుస్తుందని, దాదాపు 2500 ఎకరాలకు సాగునీరు, 5000 బోర్లకు ఈ చెరువు జీవనాధారమని ఆయన గుర్తుచేశారు. నీరు ఇలా వృథా అవుతుండగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చలనం లేకపోవడం బాధాకరమని, మరికొద్ది రోజులు ఇలా కొనసాగితే రాబోయే వ్యవసాయ కాలం సంక్షోభంలో పడుతుందని రైతులు పేర్కొన్నారు. చెరువులో ఇప్పటికే రెండు అడుగుల మేర నీరు బయటకు వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు. ఈ విషయం మీద



మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇరిగేషన్ శాఖ అధికారులను రైతు సంఘం ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. చెరువు కట్టకు శాశ్వత పునరుద్ధరణ పనులకు ఒక కోటి 40 లక్షల ప్రతిపాదనను ప్రభుత్వం వద్దకు పంపినట్టు, అలాగే ఎఫ్డిఎ కింద 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఇరిగేషన్ విభాగం ఫోన్ ద్వారా తెలిపిందని రైతుసంఘం నాయకులు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ వారు తక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు, ధర్నాలు తప్పవని, రైతు సంఘం మిగతా సంఘాలతో కలిసి ఉద్యమానికి సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు. చెరువును కాపాడుకోవడం ఈ ఆయకట్టు కింద ఉన్న ప్రతి రైతు బాధ్యతగా వారు పిలుపునిచ్చారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మన్నె సాంబశివరావు, వెలుగొండ ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు కొర్లకుంట జానకిరఘు, జి.గురునాథం, కె.కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఇదెమ్మ, ఆయకట్టు మాజీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఆనందరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా స్వామిత్వ గ్రామసభ



**కొనకనమిట్ల పెన్ పవర్ నవంబర్ 20**

మండలంలోని ఇరసలగుండం గ్రామ పంచాయతీలో స్వామిత్వ గ్రామసభను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈశ్వరమ్మ పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు,హక్కుల పత్రాల పంపిణీ,పంచాయతీ పరిపాలన,గ్రామ మ్యాపింగ్ వంటి ముఖ్య అంశాలపై సభలో చర్చించారు.స్థానికుల నుంచి సూచనలు స్వీకరించి,గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం.ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

## కార్తీక అమావాస్య పురస్కరించుకొని ఆనంద ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



**దొనకొండ నవంబర్ 20 పెన్ పవర్**

మండల కేంద్రంలో విరాట్ నగర్ లో శ్రీ ఆనంద ఆశ్రమంలో కార్తీక అమావాస్య పురస్కరించుకొని మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు అరటి మండపాలతో అయ్యప్ప స్వామి వారి పడిపూజ భజన కార్యక్రమంలు ఘనంగా నిర్వహించారు భైరవానంద స్వామి పరివేక్షణలో అర్చకులు మణి బాబు శర్మ కే వెంకటేశ్వర స్వామి గురు స్వాములు శెన్నంశెట్టి వెంకటరావు స్వామి సుబ్బారావు స్వామి అడివయ్యాస్వామి బత్తుల బ్రహ్మయ్య స్వామి ఎం వెంకటేశ్వర గురు స్వాములు అభిషేక పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు అధిక సంఖ్యలో దీక్ష దారులు భక్తులు పాల్గొని శివతాండవంతో పరవశించిపోయారు భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు భిక్ష ఏర్పాటు చేశారు.

## ఖాదర్ భాషను పరామర్శించిన బెల్లంకొండ విజయలక్ష్మి



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 20**

బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష ను జిల్లా బిజెపి అధికార ప్రతినిధి, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ విజయలక్ష్మి పరామర్శించారు. ఖాదర్ భాష ఇటీవల అనారోగ్యానికి గురై, చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న విజయలక్ష్మి గురువారం నాడు ఒంగోలు లోని ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లి, అక్కడ చికిత్స పొందుతున్న ఖాదర్ భాష ను పరామర్శించారు. అలాగే ఖాదర్ భాష ఆరోగ్య పరిస్థితి గురించి అక్కడి వైద్యులతో మాట్లాడారు. అలాగే చికిత్స పొందుతున్న ఖాదర్ భాష కు ధైర్యం చెప్పారు. ఖాదర్ భాష ను పరామర్శించిన వారిలో విజయలక్ష్మి తో పాటు పలువురు బిజెపి నాయకులు కూడా ఉన్నారు.

# పొగ మంచులో ప్రయాణం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

### వాహనదారులకు, ప్రయాణీలకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు చేసిన సూచనలు సలహాలను వెల్లడించిన కొమరోలు ఎస్ఐ నాగరాజు





**కొమరోలు పెన్ పవర్ నవంబరు 20**

పొగ మంచు కురుస్తున్న సమయంలో ప్రయాణాలు సాగించే వాహనదారులు ,ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పలు సూచనలు సలహాలు ఇచ్చారని కొమరోలు ఎస్సై జె నాగరాజు తెలిపారు. గత కొన్ని రోజులుగా తెల్లవారుజామున, రాత్రి వేళల్లో పొగ మంచు కురుస్తున్నదని, అంతేగాక తీవ్రమైన చలిగాలు కూడా వీస్తున్నాయని ఆయన తెలిపారు. పొగ మంచులో వాహనదారులతోపాటు పాదచారులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగ మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాదచారులు కూడా ప్రమాదాలకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు .దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కూడా ఒకదాని ఒకటి కనిపించక ప్రమాదాలు జరుగుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. అందువల్ల అత్యవసరమైతే తప్ప వాహనదారులు పొగ మంచులో ప్రయాణాలు వాయిదా వేసుకోవటం సమంజసం అని అన్నారు. అలాంటి పరిస్థితులలో వాహనదారులు తమ వాహనాల హెడ్ లైట్లను వేసుకొని ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ హారన్ మ్రోగిస్తూ, నెమ్మదిగా ప్రయాణం చేయటం శ్రేయస్కరమని అన్నారు .ఇంకా వాహనదారుల వద్ద ఫాగ్ లైట్లు ఉంటే వాటి వినియోగించుకోవడం మరింత ఉపయోగకరమని అన్నారు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లో కూడా హై భీమ్ లైట్లలను వినియోగించవద్దని ,కేవలం లో బీమ్ హెడ్లైట్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. వైపర్లను ఉపయోగించి అద్దాలను విజబుల్ గా ఉంచాలని సూచించారు. వాహనాల మధ్య 5 లేక 6 సెకండ్ల గ్యాప్ ఉంచాలని, పొగ మంచు దట్టంగా ఉన్న సమయంలో వాహనాలు నడపటం ఇబ్బందికరంగా మారిన పరిస్థితులలో వాహనాలను రోడ్డుపై ఆపకుండా సాధ్యమైనంత వరకు రోడ్డు సైడ్ కు పార్కు చేసి హజార్డులైట్లను ఆన్ చేసి ఉంచాలని కోరారు. పొగ మంచు కురుస్తున్న సమయంలో డ్రైవర్లు తమ వాహనాలను జాగ్రత్తగా నెమ్మదిగా నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంతో పాటు తాము కూడా సురక్షితంగా సురక్షితంగా ఇంటికి చేరాలనే సంకల్పంతో వాహనాలు నడపాలని, వేగాన్ని తగ్గించడం వల్ల గమ్యస్థానం చేరడంలో కొంత ఆలస్యం జరగవచ్చు కానీ, ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చు అని తెలిపారు .ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే సమయంలో రోడ్డు మార్జిన్లలో సంచరిస్తున్న పెంపుడు జంతువులు, పాదచారులను, సైకిలిస్టులను గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కూడా పొగ మంచు సమయంలో అత్యంత జాగ్రత్తగా వాహనం నడపాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించి హెడ్లైట్స్ వేసుకుని ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ ,రోడ్డు మలుపులో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణాలు సాగించడం వలన ప్రమాదాల నుంచి బయటపడవచ్చని ఆయన తెలిపారు. ముఖ్యంగా రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు పొగ మంచు ఎక్కువగా కురుస్తూ ఉంటుందని , కొన్ని సమయాలలో ఉదయం ఏడు గంటల వరకు కూడా పొగ మంచు దట్టంగా కురుస్తూ దారి కనిపించని పరిస్థితులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడ, ఎటువైపు నుంచి వస్తాయో తెలియదని ,అందువల్ల డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆటోవాలాలు మంచు కురుస్తున్న సమయంలో కూడా సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణించటం ప్రమాదకరమని, ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని , తమపై ఎంతో నమ్మకంతో ప్రయాణికులు ఆటోలలో ప్రయాణం చేస్తుంటారని, ఆటోవాలాలు ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పరిమితంగా ప్రయాణికులు ఎక్కించుకొని వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఎస్ఐ నాగరాజు హితవు పలికారు. పోలీసుల సూచనలు సలహాలను, రోడ్డు నిబంధనలను అతిక్రమించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# పొదిలిలో దాతలను సన్మానించిన శివాలయం చైర్మన్



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 20**

స్థానిక నిర్మ మహేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య దాతలను సన్మానించారు. కార్తీక మాసంలో శివాలయం కు వచ్చే భక్తులకు అన్ని విధాల సహకరించిన దాతలను చైర్మన్ వెంకటరామయ్య గురువారం నాడు పట్టు వస్త్రాలతో సన్మానించారు. కార్తీక మాసంలో నిర్మ మహేశ్వర దేవస్థాన నీకి వచ్చిన భక్తులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన మొత్తం 25 మంది దాతలను ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామయ్య సన్మానించడం జరిగింది. కుల మతాలకు అతీతంగా కార్తీక మాసం లో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆలయ చైర్మన్ వెంకట్రామయ్య తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# కబడ్డీలో సత్తా చాటిన బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఆరుగురు ఎంపిక



**మార్కాపురం టౌన్ 10 పవర్ నవంబర్ 20**

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు స్థానిక జిల్లా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా , కనిగిరి మండలం కంచర్ల వారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17 కబడ్డీ పోటీలలో విద్యార్థులు సత్తాచాటి ఎంపికయ్యారు. వి. మహేష్, ఎం. అజయ్ లు అండర్ 14 లో, ఎం.జస్వంత్ నాయక్, పి.అజయ్ , యం.అభి, మరియు డి. రాజశేఖర్ రెడ్డి లు అండర్ 17 కబడ్డీ ప్రకాశం జిల్లా జట్టుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు.ఎంపికైన విద్యార్థులు కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగం, కర్నూలు జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి అండర్ 17 బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జట్టుకు ఎంపిక అయిన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు డి.శ్యామల దేవి.. పి.దామోదర్ రెడ్డి, కె. ఓబులేసు లను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

# ఎస్టీ హాస్టల్ నీ ఆకస్మిక తనిఖీ చేసిన డిటి డబ్ల్యూ



**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 20**

పుల్లల చెరువు మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ మురికి మల్ల ఆశ్రమ పాఠశాలలో గురువారం డిటి డబ్ల్యూ లోతేటి వరలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు.ముందుగా వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది హాజరు, విధి నిర్వహణపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.తదుపరి హాస్టల్ పరిసరాలను పరిశీలించిన వరలక్ష్మి అక్కడి పరిశుభ్రత, వంటశాల పరిస్థితులు, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతపై విచారణ జరిపారు. విద్యార్థుల విద్యాభ్యాసం, హాస్టల్‌లో లభిస్తున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు పట్ల ఆసక్తి, సామర్థ్యాలపై కూడా సమీక్ష చేపట్టారు.పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆమె కోరారు.సిబ్బంది తమ తమ బాధ్యతలను క్రమం తప్పకుండా నిర్వర్తించాలని, విద్యార్థుల ఆరోగ్యం, నివాసం, చదువు విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని ఆమె ఆదేశించారు. హాస్టల్ నిర్వహణలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని హాస్టల్ వార్డెన్ కి సూచించారు.

# ఫర్హాన్‌కు వినికిడి యంత్రం పంపిణీ

### - ఎంపీ మాగుంట.. కలెక్టర్ రాజాబాబులకు బాలుడి తల్లిదండ్రుల కృతజ్ఞతలు



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 20**

ఒంగోలు కబేళా బజార్ నివాసి మహమ్మద్ ఫర్హాన్ వినికిడి లోపంతో బాధపడుతున్నారని ఎస్-7 స్పీచ్ ప్రాసెసర్ మంజూరు కొరకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు, కలెక్టర్ ని కోరారు. వారి అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించి, ఎంపీ-లాడ్స్ నిధుల నుండి రూ. 4,05,400/- ఎస్-7 స్పీచ్ ప్రాసెసర్ కు మంజూరు చేసి యంత్రము ను అందజేశారు. ఎస్-7 స్పీచ్ ప్రాసెసర్ పొందిన లబ్ధిదారుడు మహమ్మద్. ఫర్హాన్ వారి తల్లి షేక్ సబీహా, సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సి. హెచ్. సువార్త వారితో పాటుగా జిల్లా కలెక్టర్ ని కలిసి తన కుమారునికి అందించిన అమూల్య సహాయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ బాలుడితో వినికిడి యంత్రం పని తీరు పై అడిగి తెలుసుకున్నారు.

# మంత్రి నారాయణతో ఎమ్మెల్యే జనార్దన్ భేటీ

### - అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, అవినీతి పరులపై విజిలెన్స్ విచారణ జరపాలని వినతి

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 20**

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ని బుధవారం సచివాలయంలోని వారి కార్యాలయంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కలిశారు. ఒంగోలు నగరంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు కు, పోతురాజు కాలువ,నల్ల వాగు కాలువ అభివృద్ధికి నిధులు మంజూరు గురించి ప్రతిపాదనలు అందజేశారు. మెప్మా లో జరిగిన అవినీతి పై లోతైన విజిలెన్స్ ఎంక్వయిరీ వేయాలని కోరారు. మునిసిపల్ కార్పొరేషన్ కి రావలిసిన నిధులు సుమారు రూ. 79 కోట్లు.. కాంట్రాక్టర్లకు రావలిసిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దామచర్ల మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు.



# మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ ను వ్యతిరేకించాలి

### - పిడిఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 20**

ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేస్తుందని, అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అటువంటి చర్యలను వ్యతిరేకించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యూ )రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కి వ్యతిరేకంగా, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడియస్ యూ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం ఒంగోలు నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి నూతనంగా 17 మెడికల్ కళాశాలలను కేటాయించిందని, గత ప్రభుత్వ హయాములో ఐదు పూర్తి చేసి తరగతులు జరుగుతుండగా, నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మిగిలిన కళాశాలలను పూర్తి చేసి, తరగతులు నిర్వహించాల్సి ఉండగా... ఈ కళాశాలలో మేము నిర్వహించలేమని, ప్రభుత్వ -ప్రైవేటు- భాగస్వామ్యం -ద్వారా (పిపిపి )




నిర్వహించాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీవన్ నెంబర్ 107,108,590 లను రద్దుచేసి అర్హులైన ప్రతి విద్యార్థి మెడిసిన్ చదివే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్. సిసింద్రీ బాబు, నాయకులు . వి. కోటి, సిహెచ్,సాంసన్, చంద్రశేఖర్, సచిన్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బూటకపు ఎన్ కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

### - సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 20**

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్కౌంటర్ల పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రామరాజ్యం పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతిరోజు నక్సలైట్లను దారుణంగా కాల్చి చంపటమే పనిగా పెట్టుకున్నారన్నారు. నక్సలైట్లు వద్ద పోలీసులు ఉన్నారని, పారా మిలిటరీ దళాలు ఉన్నాయని, ఆయుధాలు ఉన్నాయనే పేరుతో కేంద్ర బలగాలు అమాయకులైన గిరిజన ప్రజలను ఎన్కౌంటర్ల పేరుతో చంపటం ఎంతవరకు సబబు అన్నారు. తాము చర్చలకు సిద్ధమని ఒక పక్కా నక్సలైట్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానవ మారణ కాండను కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిపుత్రులను చర్చలకు పిలిసి వారి సమస్యలను చర్చించి, వాటికి పరిష్కార మార్గం చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మారణ కాండను సృష్టిస్తుందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలు పూర్తిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఒక హంతక ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారన్నారు. దీనిని ప్రజలు సహించడని, ప్రజాస్వామ్య వాదులంతా దీనిని ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఎన్కౌంటర్లు ఖండించే వారిపై కూడా కేసులు ఉంటాయని, తమ నెక్స్ట్ టార్గెట్ టు అర్బన్ నక్సలైట్లని పేర్కొనటం దుర్మార్గమన్నారు. నేడు నక్సలైట్లు, రేపు కమ్యూనిస్టులు, ఆ తర్వాత లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులపై కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడులు జరిపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు తమ గళాన్ని మరింత విప్పాలని పిలుపునిచ్చారు. బూటకపు ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు ఎంఏ సాలార్ తదితరులు పాల్గొన్నారు.

# అభిషేకం నిర్వహించిన జడ్.పి.టి.సి వెన్నా ఇందిరా



**తర్లుపాడు పెన్ పవర్ నవంబర్ 20**

కార్తీకమాసం పురస్కరించుకుని తర్లుపాడు మండలం కేతగుడిపి శివాలయాన్ని జెడ్.పి.టి.సి వెన్నా ఇందిరా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో శివలింగానికి అభిషేకం చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ఆమెకు తీర్థ ప్రసాదలను అందజేశారు. కోరుకున్నా కోరికలు తీర్చే స్వామిని దర్శించుకోని అభిషేకంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక పూజలలో పద్మ , వాణి , పార్వతి, శ్యామల , తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజులు సాగర్ కవచ్





**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 20**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు, మెరైన్ పోలీసులు సంయుక్తంగా బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సముద్రతీర భద్రతను పరీక్షించడం, ఉగ్రవాద దాడుల సమయంలో భద్రతా వ్యవస్థల ప్రతిస్పందన సామర్థ్యాన్ని అంచనా వేయడం లక్ష్యంగా సాగర్ కవాచ్ పేరిట రెండు రోజులపాటు తీర భద్రతా వ్యాయామాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా సముద్రతీర ప్రాంతంలో మొత్తం 112 మంది పోలీస్ సిబ్బంది, అధికారులు, మెరైన్ పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్గా ఉన్నారు. ఉగ్రవాద కదలికలకు సంబంధించి సమాచారం సేకరించడం, సముద్ర మార్గంలో చొరబాట్లను అడ్డుకోవడం, అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, చొరబాటుదారులను విచారించడం వంటి కీలక దశల్లో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. పోలీసు బృందాలు ఈ మాక్ డ్రిల్ లో భాగంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పటిష్ట బందబస్తును నిర్వహిస్తూ, వాహన తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. నవంబర్ 20 మరియు 21 తేదీల్లో జరిగే ఈ మాక్ డ్రిల్ లో ఉగ్రవాదులుగా వ్యవహరించే బృందం తీరప్రాంతంలోకి చొరబడే ప్రయత్నం చేస్తే, వారిని సమర్థవంతంగా అడ్డుకోవాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు.

# పరిశుభ్రత గ్రామంగా యండ్రపల్లి

**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 20**

జిల్లా కలెక్టర్,డిపివో ఆదేశాల మేరకు మండలంలోని యండ్రపల్లి పంచాయతిని మోడల్ విసిబ్లీ క్లిన్ విలేజీ గా ఎంపిక చేసినట్లు ఎంపిడివో సంజీవరావు తెలిపారు. అందులో భాగంగా పంచాయతీ లోని ఎనిమిది వార్డులకు ఎనిమిది మంది పంచాయతిబకాశ్రయదర్సులను నియమించినట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల నుండి గ్రీన్ అంబాసిడర్స్,గ్రీన్ గార్డ్ లు హాజరుకావాలని ఆదేశించారు.ప్రతి పంచాయతీ కార్యదర్శికి ఐదు మంది గ్రీన్ అంబాసిడర్స్ ను కేటాయించి వారి ద్వారా 21 వ తేదీ శుక్రవారం క్లిన్ అండ్ గ్రీన్ విలేజ్ ,శానిటేషన్ కార్యక్రమాలు ఉదయం ఆరుగంటల నుండి 9 గంటల వరకు డోర్ టు డోర్ తడి చేత,పొడి చెత్త సేకరణ,9 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పారిశుధ్య కార్యక్రమం,ఎస్డబ్ల్యుపిసి షేడ్ నిర్వహణ పై అవగాహన ట్రైనింగ్ జరుగుతుందని,ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం గ్రామాలను శుభ్రంగా ఉంచడం అని,ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలన్నారు.

# డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

## – జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. భారతి

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, ఎన్ పవర్ నవంబర్ 20**

డిసెంబర్ 13 వ తేదీ జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్ ఏ. భారతి అన్నారు. గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో.. న్యాయస్థానాలలో పెండింగు లో ఉన్న వ్యాజ్యాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వలన ఇరు వర్గాలు గెలిచినట్టే భావించబడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. లోక్ అదాలత్ లో పరిష్కరించుకున్న వ్యాజ్యాలకు కోర్టు ఫీజు తిరిగి ఇవ్వటం జరుగుతుందని, అదేవిధంగా లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు గా కక్షిదారులు అందరూ గమనించాలని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో ప్రత్యేక బెంచీలు ఏర్పాటు ద్వారా సత్వరం సమస్య పరిష్కారానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రీ సిట్టింగ్స్ రూపంలో వ్యాజ్యాలను ముందే పరిష్కరించుకోవచ్చుని 13 వ తేదీ సంబంధిత అవార్డుని పొందవచ్చుని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని సమయం ధనం ఆదా చేసుకోవాలని తెలియజేశారు.

# స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణానికి 50 వేల రూపాయల విరాళం

**తాడేపల్లిగూడెం, నవంబర్ 20:**కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన తాడేపల్లిగూడెం స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం తిరిగి ఊపందుకున్నాయి. ఈ పునర్నిర్మాణ కార్యక్రమం కోసం తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ గారి ప్రత్యేక చొరవ కొనసాగుతుంది.

ఈ సందర్భంగా దాతలు శ్రీ భూపతిరాజు శివాజీరాజు, శ్రీ సాయి సీతారామరాజు (శ్రీ వెంకట నరసింహ డెవలపర్స్ ం లోటస్ ఎంక్లేవ్ వెంచర్) తరఫున రూ.50,000/- (యాభై వేల రూపాయలు) విరాళాన్ని అందించారు. ఈ విరాళాన్ని గౌరవ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గారి చేతుల మీదుగా స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణ నిర్వాహకులు కాంట్రాక్టర్ శివ మరియు కూచిపూడి అనిల్ కుమార్ లకు అందజేశారు.

విరాళం అందజేసిన సందర్భంగా %ూఅ%. పేరుచర్ల మురళీకృష్ణంరాజు గారికి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణం పూర్తవడంతో స్థానిక యువతకు క్రీడా అవకాశాలు మరింత విస్తరించనున్నాయని అధికారులు పేర్కొన్నారు.



# ఎంపీ పురందేశ్వరిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదు

- దేశంలోను, రాష్ట్రంలోను కనుమరుగైన కాంగ్రెస్
- గల్లీస్థాయి కాంగ్రెస్ నాయకుల నిరాధార విమర్శలు హాస్యాస్పదం
- ఎం పీ అంటే రాజమండ్రికి పరిమితం కాదు గదా
- మీడియా సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 20:**దేశంలోను, రాష్ట్రంలోను కనుమరుగై ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తే సహించేది లేదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఖండించారు. ఎంపీ అంటే ఒక్క రాజమండ్రి కే పరిమితం కాదని దేశానికి, రాష్ట్రానికి సంబంధించిన బాధ్యతలు ఉంటాయని అన్నారు.స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంపీ పురందేశ్వరి కామన్వెల్త్, ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొని దేశ ,రాజమండ్రి ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటారని,ఆపరేషన్ సిందూర్ లో దేశీయ విధానాన్ని యూరప్ దేశాలకు సమర్థవంతంగా తెలియచేయగలిగారని అన్నారు. ఓటు చోర్ ప్రచారంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధి పరువు పోగొట్టుకున్నారని పిక్కి నాగేంద్ర గుర్తు చేశారు. గల్లీస్థాయి కాంగ్రెస్ నాయకులు కూడా ఎంపీ పురందేశ్వరిపై విమర్శలు చేయడం హాస్యాస్పదం ఉందన్నారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత దగ్గుబాటి పురందేశ్వరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రి కందుల దుర్గేష్ లతో కలిసి సమన్వ యంతో పనిచేస్తూ నిధులు తెస్తున్నారని ఆయన వివరించారు. రూ.270 కోట్లతో రాజమండ్రి రైల్వే స్టేషన్ లో 4,5,6 ప్లాట్ ఫారాల అభివృద్ధికి చర్యలు చేప ట్టారన్నారు. గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారని పిక్కి నాగేంద్ర చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి, కొవ్వూరు-నల్లజర్ల,దేవరపల్లి -ఖమ్మం గ్రీన్ హై వేస్ కు కృషి చేశారని,రాజమండ్రి నుంచి ఢిల్లీ ముంబై తిరుపతికి విమాన సర్వీసులు నడపడానికి సహకారం ఉందని ఆయన చెప్పారు. రాజమండ్రి మెడికల్ కాలేజీ,ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని ఆయన వివరించారు. జిల్లాకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ కారు డ్రైవరు ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై దుర్భాషలాడడం తగదని అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశామని పిక్కి నాగేంద్ర చెప్పారు. ఈవీఎం గోదాములను ఎంపీ పురందేశ్వరి మేనేజ్ చేస్తున్నారని ఆరోపించడం అవగాహన రాహిత్యమని ఆన్నారు. బీజేపీ నాయకులపై తప్పుడు ప్రచారం,అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల షమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, యెనుముల రంగబాబు,వీరా వీరాంజనేయులు,జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామ కృష్ణరాజు,ఎస్ సూర్య కిరణ్,ఏనాపు యేసు,కందికొండ రమేష్,తగరం సురేష్,బండిప్రసాద్,రవిశంకర్,రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు ప్రజల్లో చైతన్యం పెంపొందించే కేంద్రాలు ం గోదావరి కవి ర్యాలి శ్రీనివాసు.



**కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 20:**సామాజిక చైతన్యానికి, ప్రజల్లో విజ్ఞాన విస్తరణకు గ్రంథాలయాలు ప్రధాన భూమిక వహిస్తున్నాయని గోదావరి కవి డా.ర్యాలి శ్రీనివాసు అన్నారు. పామర్రు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 58వ వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాకవి కందుకూరి వీరేశలింగం పంతులు అర్ధరూపాయి రుసుము చెల్లించి గ్రంథాలయం నుండి పుస్తకాలు అద్దెకు తీసుకుని చదివి యుగకర్తగా నిలిచారని స్మరించారు. ప్రభుత్వం కొంతవరకే గ్రంథాలయాల పరిరక్షణ చూసుకుంటుందని, స్థానిక విద్యావంతులు వాటి అభివృద్ధికి ముందుకు రావాలని టిడిపి నాయకుడు మరివాడ సూరిబాబు పిలుపునిచ్చారు. పామర్రు హైస్కూల్ హెచ్.ఎం ఈశ్వరుడు మాట్లాడుతూ, గ్రామాల్లో ఒక్క గ్రంథాలయం ఉంటే అనేక మంది విద్యావంతులు, అధికారులు తయారవుతారని, వాటి ఆవశ్యకత అపారమని తెలిపారు. సోషల్ టీచర్ చౌదరి, వీఆర్ఓ మాగాపు వీర భద్ర రావు, హెచ్.ఎం ఓ.వి. రమణ, అవసరాల వెంకటరావు, లైబ్రేరియన్ ఎన్. గంగాధరరావు తదితరులు ప్రసంగించారు. వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

# పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన 89 వేలమంది కి నష్ట పరిహారం చెల్లించాలి

- నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం
- డిసెంబర్ మొదటివారంలో వై.ఎస్.షర్మిల పోలవరం ప్రాజెక్టు సందర్శన
- పీసీసీ ఉపాధ్యక్షుడు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ, నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్



**రాజమహేంద్రవరం పెన్ పవర్, నవంబర్ 20**

పోలవరం ప్రాజెక్టు ముంపువల్ల నష్టపోతున్న 89 వేలమంది నిర్వాసితులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ, నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా నియమించిన తమ కమిటీ పోలవరం నిర్వాసితుల సమస్యలను తెలుసుకుంటోందని, ఈనెల 18 న గత ఆరునెలలకు సంబంధించిన కమిటీ పోలవరం నిర్మాణ ప్రగతిపై, నిర్వాసితుల సమస్యలను సమీక్ష చేశామని ఆయన చెప్పారు. స్వర్గీయ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా తయారుచేసిన డిపిఆర్ ప్రకారం పోలవరం ఎత్తు 45.72 మీటర్లని, తద్వారా ఏడు మండలాల్లో 270 పైగా గ్రామాలకు చెందిన దళిత, గిరిజన ప్రజలు 89 వేలమంది నిర్వాసితులవుతున్నారని పేర్కొన్నారు. వీరందరికీ పునరవాసం కింద రూ.55 వేల కోట్లు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. భారీ ఎత్తున నిధులు ఇవ్వలేక కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సీఎంలపై పలు రకాలుగా ఒత్తుళ్ళు పెంచి ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లకు తగ్గించిదన్నారు. ఆమేరకు 38 వేలమంది నిర్వాసితులకు రూ.30 వేల కోట్లు మాత్రమే పరిహారం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. దాంతో రూ.25 వేల కోట్లు ఎగవేయడానికి కేంద్రం చూస్తోందని, తద్వారా సుమారు 50 వేలమంది నిర్వాసితులు నష్టపోతారని ఆయన విచారం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడంలో గానీ, నిర్వాసితులకు ఆర్ ఆర్ ప్యాకేజీ అమలు చేయించుకోవడంలో గాని, నిధులను మంజూరు చేయించు కోవడంలో కానీ గత ఐదు ఏళ్ళు ప్రస్తుతం అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్లో ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. నిర్వాసితులకు ఆర్ ఆర్ ప్యాకేజీ అందేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని మార్టిన్ లూథర్ స్పష్టం చేశారు. పోలవరం ఎత్తు 41.15 మీటర్లకు తగ్గించడంవల్ల బహుళార్ధ సాధక ప్రాజెక్టు కాదని, ఎత్తిపోతల అవుతుందని ఆయన విమర్శించారు. ఇంతవరకు నిర్వాసితులకు కేవలం 25.75 శాతం మాత్రమే ఆర్.ఆర్.ప్యాకేజీలో పరిహారం అందిందని, ఇంకా 75 శాతం మందికి చెల్లించాల్సిఉందని ఆయన చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు, నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకు డిసెంబరు మొదటివారంలో పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల వస్తున్నారని మార్టిన్ లూథర్ తెలిపారు. అధ్యయన కమిటీ సభ్యుడు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే కుడి ,ఎడమ కాలవల్లోకి సహజంగా నీరు వెళ్ళదని ప్రాజెక్టు నిర్మాణం వృధాయే నని అన్నారు. ఈ ప్రాజెక్టు గోదావరి పుష్కరాల సమయానికి పూర్తవు తుందని, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేశారని చెప్పారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించి రూ.25 వేల కోట్లు పరిహారాన్ని ఎగవేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని ఆయన ముంపు ప్రాంతం లోని 89 వేలమంది నిర్వాసితులకు ఆర్.ఆర్.ప్యాకేజీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్,నాయకులు బెజవాడ రంగారావు,దేవత సుధాకర్, కొవ్వూరి శ్రీనివాసరావు,కిషోర్ జైన్,నల్లా వీర్రాజు,బత్తిన చంద్రరావు,సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతన అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు ఎన్ పవర్ నవంబర్ 20**

జిల్లా స్థాయిలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండు సంవత్సరాల (2026, 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్ లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ పి. రాజాబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026, 2027 రెండు సంవత్సరాలకు జారీ చేసే అక్రిడిటేషన్స్ కు నిబంధనల మేర అరత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్ లైన్ వెబ్ సైట్ https://mediarelations.ap.gov.in ద్వారా స్వీకరిస్తారన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబర్ 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండు సంవత్సరాల (2026, 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్ లకు దరఖాస్తుల స్వీకరణ లో భాగంగా జిల్లా నుండి ప్రచురితమవుతున్న ప్రింట్ మీడియా, జిల్లా నుండి ప్రసారమవుతున్న ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల వివరాలు పోర్టల్ లో పొందుపరచవలసి ఉన్నందున సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్ లో పొందుపరిచి, జిరాక్స్ కాపీలను కూడా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కలెక్టరేట్ కాంపౌండ్, ఒంగోలు కార్యాలయంలో అందజేయవలసినదిగా మీడియా సంస్థల యాజమాన్యాలను కోరారు. అనంతరం పాత్రికేయులు నవంబర్ 21వ తేదీ నుండి ఆన్ లైన్ వెబ్ సైట్ https://mediarelations.ap.gov.in లో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. సమర్పించవలసిన డాక్యుమెంట్లు దినపత్రికలు/పత్రికలకు పి ఆర్ జి ఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్. దినపత్రికలు/పత్రికలకు ఏబిసి/ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (మునుపటి రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్‌పేపర్స్ ఫర్ ఇండియా) ఎంప్యానెల్డ్ సిఏ సర్టిఫికేట్. సంస్థ యొక్క పాన్ కార్డ్ మరియు గత 2 సంవత్సరాల ఐటీ రిటర్న్లు (వార్తా సంస్థలకు) యొక్క ఫోటో కాపీ. పి ఆర్ జి ఐ కి సమర్పించిన వార్షిక రిటర్న్ల తాజా కాపీ (దినపత్రికలు పత్రికల కోసం) , ముద్రించిన, అమ్ముడైన కాపీల ప్రచురణకర్త సర్టిఫికేట్ (దినపత్రికలు పత్రికలకు). కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రెగ్యులేషన్ చట్టం 1995 కింద రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (కేబుల్ ఛానెల్‌ల కోసం) ఏపీ . ఫైబర్‌నెట్ నుండి అధికార లేఖ.

# శ్రీ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా బాబా ఆశయానికి తూట్లు

సక్రమంగా అమలుకాని శ్రీ సత్యసాయి త్రాగునీటి పథకం




**గోకవరం, పెన్ పవర్, నవంబరు 20 :** పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని ప్రధాని సహా ముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు,పలువురు ప్రముఖులు, నాయకులు బాబా సేవలను, మహిమలను గుర్తుచేసుకున్నారు.అయితే మండల ప్రజలు,శ్రీసత్యసాయి త్రాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం బాబా ఆశయానికి తూట్లు పొడుస్తున్న పాలకులను గుర్తుచేసుకున్నారు.రక్షిత మంచినీరు లేక మలేరియా వంటి రోగాల బారినపడుతున్న ఈప్రాంత ప్రజలకు సురక్షితమైన త్రాగునీటిని అందించేందుకు బాబా ఆశీస్సులతో శ్రీ సత్యసాయి త్రాగునీటి సరఫరా పథకం ద్వారా శుద్ధమైన గోదావరి జలాలను ఈ ప్రాంతప్రజలకు సరఫరా అవుతున్నది. ప్రభుత్వాలు చేపట్టలేనటువంటి ఈ పథకం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలిచిందనడంలో ఎటువంటి అనుమానం లేదు.సత్యసాయి త్రాగునీరు వచ్చిన తరువాత ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా చాలావరకు తగ్గుముఖం పట్టిందని ఆప్రాంత ప్రజలు చెబుతుంటారు.అయితే ఇటువంటి అత్యుత్తమ పథకాన్ని అమలుచేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం ద్వారా పథకానికి తూట్లు పొడుస్తుందని ఈ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.మండలంలోని గ్రామాల్లో ఆయా గ్రామపంచాయితీల ద్వారా పూర్తిస్థాయిలో త్రాగునీరు సరఫరా కాకపోవడంతో అధికశాతం ప్రజలు సత్యసాయి త్రాగునీటికి అలవాటుపడ్డారు.అయితే సత్యసాయి త్రాగునీరు వారం రోజులు సరఫరా అయితే మరో పదిరోజులు నిలిచిపోతుంది.దీంతో ప్రజలు ఇతర ప్రత్యామ్నాయాలపై ఆధారపడుతున్నారు.ఇలా తరచు త్రాగేనీరు మారిపోతుండటంతో జలుబు, దగ్గు వంటి రోగాలబారిన పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. గత పందొమ్మిది నెలలుగా జీతాలు లేక కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని ప్రజాప్రతినిధులు, మంత్రులు అధికారులు ఇచ్చే ఆర్భాటపు హామీలు ఏమాత్రం అమలు కావడంలేదని ఈ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కనీసం నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే "ఆలం"లేక గత నెలరోజులుగా నీటిసరఫరా నిలిచిపోయిందని, కనీసం ఆలం ను కూడా సరఫరా చేయలేనంత నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు.శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాలకులు బాబాను పొగిడేందుకు పెట్టిన దృష్టి బాబా ఆశయాలను అమలుచేసే దిశగా దృష్టి సారిస్తే బాగుంటుందని ప్రజలు పాలకులను వేడుకుంటున్నారు.

## అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న వాసంశెట్టి సత్యం.

రైతన్నల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం.






**కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 19:** అన్నదాత మోములో చిరునవ్వే దేశానికి నిజమైన సంపదని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రెండవ విడత నిధులు విడుదల కార్యక్రమం బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె గంగవరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, వ్యవసాయ శాఖ ఏడి నాగ కుమార్ అన్నదాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజవర్గానికి రెండో విడతగా 24,092 మంది రైతులకు గాను రూ. 16.51 కోట్లు చెక్కును విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతన్నల శ్రేయస్సు కోరుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిందన్నారు. పొలం దున్నే చేతులు దేశం నిలబెట్టే శక్తిగా అభివర్ణించారు.రైతే మన భవిష్యత్తుకు బాసటగా నిలిచారనడం అతిశయోక్తి కాదన్నారు.గత ప్రభుత్వ హయాంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని విమర్శించారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ రెండవ విడత ద్వారా రామచంద్రపురం మండలంలో 7770 మంది, కే గంగవరం మండలంలో 7458 మంది, కాజులూరు మండలంలో 8864 మంది మొత్తంగా 24,092 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచిందన్నారు.ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేయడం పట్ల పలువురు రైతులు హర్షాతి రేఖలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి నాగ కుమార్, తహసిల్దార్ శ్రీరామ్, ఏఈ లు సద్గురు మూర్తి, మణిదీప్, అశోక్, అగ్రికల్చర్ అధికారి ఎం అరుణ, ఏ ఈ ఓ లు సిహెచ్ నాగరాజు,అజయ్, హేమంత్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు బలుసు శివప్రసాద్, డిసీలు నిడదవోలు సుబ్రహ్మణ్యం, కృష్ణ తేజ, కూటమి పార్టీ నాయకులు కర్రి చిట్టిబాబు, కంచుమర్తి బాబురావు, శంకర్ నారాయణ, అల్లూరి దొరబాబు , పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



**కూనవరం,పెన్ పవర్,నవంబర్ 20.** మండల కేంద్రంలోని గ్రంథాలయం నందు 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజు ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి.మాజీ జెడ్పిటిసి ఎడవల్లి కన్యకా పరమేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి, విద్యార్థిని విద్యార్థి దశ నుండే గ్రంథ పఠనం అలవర్చుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రంథ పఠనం బాల్యం నుండే అలవర్చుకోవడం వలన వారి నడవడిక సన్మార్గం వైపు పయనిస్తుందని, వారి జీవన మార్గానికి దిశా నిర్దేశం చూపుతుందని ఉద్బోదించారు. అనంతరం విద్యార్థినీ,విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖనము,వకృత్వము, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. విద్యార్థుల వేషధారణలో ఉత్తమ వేషధారణ లో గెలుపొందిన వారికి ప్రథమ,ద్వితీయ,తృతీయ కాన్సులెన్స్ బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ ఎన్ వెంకటస్వామి,గ్రంథాలయ ప్రెసిడెంట్ హెచ్ రవి,కే అరుణ,బి రమాదేవి, వీరయ్య,దివ్య భవాని,ఎస్ నారాయణ, చెరుకూరి సుబ్బారావు,విఆర్ పురం సబ్ స్టాపర్ నాగరాజు,సూది పాక శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## వెధిరేశ్వరం శానిటేషన్, అంగన్వాడీలను పరిశీలనచేసిన ఎంపీడీఓ





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు20:**ప్రభుత్వాల ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కాన్సెప్ట్‌ను పురోగతిపరచే క్రమంలో రావులపాలెం మండలంలో శానిటేషన్ చర్యలు వేగవంతం అవుతున్నాయి.గురువారం మండలం పరిధిలోని వెదిరేశ్వరం గ్రామ పంచాయతీ ప్రాంతంలో ఎంపీడీఓ సిహెచ్.సుబ్రహ్మణ్యం శానిటేషన్ పనులు,పారిశుద్ధ్య చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని షెడ్ వద్ద రోడ్డు ప్రక్కన పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.రాజుకు ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా,గ్రామం మొత్తం శుభ్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదనంతరం గ్రామంలోని 140, 057 నెంబర్ అంగన్వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల్లో బాలింతలు,శిశువులకు అందించే సేవలు, పోషకాహార పంపిణీ,హాజరురికార్డులు,పరిశుభ్రత వంటి అంశాలను వివరంగా పరిశీలించారు.కౌసలం సర్వే పనితీరును కూడా ఆయన పరిశీలిస్తూ,సిబ్బంది మరింత శ్రద్ధతో పని చేయాలని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ,"గ్రామాల అభివృద్ధి శానిటేషన్ తోనే ప్రారంభమవుతుంది. పరిశుభ్రతపై గ్రామ పంచాయతీలు, సిబ్బంది ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలి. చెత్త నిల్వలు లేకుండా,రోడ్లు%-%వీధులు శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి"అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ ఉద్యోగులు, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎంపికైన స్కేటింగ్, కరాటే విజేతలను అభినందించిన కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 20:**కాకినాడ సురేష్ నగర్‌లోని జాయ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులు జాతీయ స్థాయిలో చోటు దక్కించుకోవడంతో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం వారికి శుభాకాంక్షలు తెలిపారు.3వ తరగతి చదువుతున్న కంకటాల నిహారిక అతి తక్కువ సమయంలో స్కేటింగ్ నేర్చుకొని జాతీయ స్థాయికి ఎంపిక కాగా, 4వ తరగతి విద్యార్థి కారే మోక్ష ఆదిత్య, 8వ తరగతి చదువుతున్న కారే రేవంత్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అత్యు త్తమ ప్రతిభ కనబరిచారు. వీరిలో రేవంత్ కటాస్‌లో ప్రథమ బహుమతి, కుముటే విభాగంలో ద్వితీయ బహుమతి సాధించాడు.ఈ ముగ్గురు విద్యార్థులు కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి తమ విజయాలను తెలియజేశారు. విద్యార్థులు గెలుచుకున్న ట్రోఫీలను కలెక్టర్‌కు చూపగా, ఆయన వారిని అభినందించి ప్రోత్సహించారు.పట్టుదల, క్రమశిక్షణతో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని చిన్నారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రతినిధులు గుత్తుల సుశీల, కొవ్వాడ నాగేశ్వరరావు, పేరెంట్స్ అసోసియేషన్ సభ్యుడు సాపే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.ది

## గత ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం పెద్దలు

రూరల్ వై.సి.పి దళిత నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం




**రాజమహేంద్రవరం , పెన్ పవర్, నవంబర్ 20:** తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు నేతృత్వంలో జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అధ్యక్షతన గురువారం రూరల్ వైసిపి దళిత నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అతిధిలుగా జిల్లా ఎస్ సి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మెన్ విప్పర్తి వేణు,కొవ్వూరు మాజీ శాసనసభ్యులు, నియోజవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి తలారి వెంకట్రావు సారధ్యంలో స్థానిక రాజమండ్రి రూరల్ వై.సి.పి జిల్లా కార్యాలయంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటికరణ,కోటి సంతకాల సేకరణ, విద్య, వైద్యాన్ని పేదలకు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ విధానాలను తీవ్రంగా నిరసిస్తూ ఎస్సీ సెల్ విభాగం కోటి సంతకాల సేకరణలో రౌండ్ టేబుల్ సమావేశం లో భాగస్వాములయ్యారు. సంక్షేమం పక్కన పెట్టి వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి వాటిని ఎంత ఖర్చు చేసారన్నది జవాబు లేకుండా వ్యవరిస్తూ రని పేర్కొన్నారు. 18 నెలలు కావస్తున్న ఒక్కకొత్త పింఛను మంజూరు చేయలేదని, ఎస్సీ ,బీసీలకు పింఛన్, ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి చేసిన వాగ్దానాలన్నీ గాల్లో వదిలేశారని విమర్శించారు. ఎస్ సి ల పట్ల చులకన భావంతో ప్రభుత్వం వ్యవహారిస్తున్న తీరును ఖండించారు. ఈ కార్యక్రమంలో ఏడు నియోజకవర్గాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గొల్లపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి రోగుల భారీ స్పందన



**కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 20:**కాజులూరు మండలంలోని గొల్లపాలెం సాక్షిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు.కృప ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వైద్యులు పి.జాషువ (శ్రీను) ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కాకినాడ సిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సీహెచ్. ప్రకాశ్, డాక్టర్ మహేష్, డాక్టర్ సీహెచ్. బ్యూలా తదితరులు పాల్గొని వివిధ వ్యాధులపై రోగులకు పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు.

## ఉద్యోగుల పీజీఆర్ఎస్ కార్యక్రమం : అర్జీలు స్వీకరణ సాయంత్రం 4 నుంచి 5 వరకు

**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 20:**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు మేరకు ఈ నెల మూడవ శుక్రవారం,21వ తేదీన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.కలెక్టర్ జారీ చేసిన ప్రకటన ప్రకారం,శుక్రవారం సాయంత్రం 04 గంటల నుంచి 05 గంటల వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరించబడతాయి.ఈ సంద ర్భంగా సంబంధిత విభాగాధికారులు తప్పనిసరిగా 3.45 నిమిషాలకు పీజీఆర్ఎస్ హాల్లో హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులు సమర్పించాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

# బీజేపీలోకి 20 మంది

**- కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో చేరిక**



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 20**

ప్రకాశం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 20 మంది గురువారం భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కో - కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ప్రకాశం జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మాకినేని అమరసింహం ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. గుత్తి శ్రీధర్, జీ శివ కృష్ణ, వాసుదేవ్, కిషోర్ కుమార్ తో సహా మరో 20 మందికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోడీ, ఎన్డీయే ప్రభుత్వంలో జరుగుతున్న ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో, జిల్లాలో బీజేపీ నాయకులు చేస్తున్న కృషి గురించి కమ్మిశెట్టి లక్ష్మి, నగేశ్ బాబు ద్వారా తెలుసుకుని, ఆకర్షితులై పార్టీలో చేరినట్లు 20 మంది కార్యకర్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాయపాటి అజయ్, జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, బీజేపీ నాయకులు సత్యవతి, దండు శ్రీనివాస్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

**గూడంశెట్టి రవికుమార్**



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 20**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించేందుకు జనసేన పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని జనసేన పార్టీ మండల నాయకులు గూడంశెట్టి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ - బీజేపీ - జనసేన కూటమి ప్రభుత్వం మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ సర్పంచ్ స్థానాలకు కేటాయించిన చోట్ల పోటీకి సన్నద్ధం కావాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి చేరవేసి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పార్టీ బలం పెంచేందుకు ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి బూత్ లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఓ ప్రకటనలో తెలిపారు.

# అండర్ 19 హ్యాండ్ బాల్ బ్రోచర్ ఆవిష్కరణ

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 20**

ఈనెల 23,24,25 తేదీలలో ప్రకాశం జిల్లా సింగరాయకొండ జూనియర్ కాలేజీ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 19 రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్ బ్రౌచర్ ని బుధవారం కలెక్టర్ రాజబాబు తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అండర్ -19 ఎస్ జి ఎఫ్ సెక్రటరీ ఈదర చింపారెడ్డి పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీలు ఎం ఆదినారాయణ, పి. శివశంకర్, చింపా రెడ్డి పాల్గొన్నారు.



# వైద్యం పేదలకు దూరం చేసేందుకు ప్రైవేటీకరణ





**ఉలవపాడు పెన్ పవర్, నవంబర్ 20**

వైద్య విద్యను పేదలకు దూరం చేసేందుకే ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తున్నారని వైకాపా నాయకులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ సూచనల మేరకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఉలవపాడు మండల వైస్సార్సీపీ ఆధ్వర్యంలో ఉలవపాడు నందు కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, రాష్ట్ర నాయకులు వెలిచెర్ల ధనకోటి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మద్దసాని నవీన కృష్ణ, జిల్లా నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, జమ్ము మాదవ , వెలిచెర్ల చంద్రశేఖర్, నియోజకవర్గ నాయకులు సయ్యద్ ఫజిల్ మండల నాయకులు సయ్యద్ దస్తగిరి సాహెబ్, జంపని అనురాధ ,మేడిద ప్రేమనాథ్ ,సయ్యద్ సుల్తాన్ షరీప్ మండల నాయకులు మానం సుబ్బారావు, సన్నెబోయిన సుధాకర్, కొత్తా రమణారెడ్డి, దాసరి తిరుపాలు ,దాసరి రాము, మండల సోషల్ మీడియా ఆలూరి మదు ఇతర పార్టీ నాయకులు, అభిమానులు, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

# కోవూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 20:**

మండల పరిధిలోని కోవూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు కోవూరు సర్పంచ్ ఆవుల మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించటం జరిగిందన్నారు. అదే విధంగా గ్రామంలో దోమల నివారణకు పాగింగ్ కార్యక్రమం కూడా చేపట్టారు. గ్రామస్తులు,ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సిహెచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్య జాబ్ మేళాతో పరిష్కారం

**నియోజకవర్గటీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు**




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 20**

ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న యువత కోసం, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం జాబ్ మేళా ఉపయోగ పడుతుందని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ,జిల్లా ఉపాధి కార్యాలయం,సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలొఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నో భారీ పరిశ్రమల స్థాపనకు నడుం బిగించిందని, యువతకు ఉపాధి కల్పించి, ఉద్యాగాలా కల్పనకు కృషి చేస్తుందని అన్నారు. ఈ జాబ్ మేళా కు దాదాపు 9 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 19 నుంచి 30 వయసు గల మధ్య వయసు కలిగి పదో తరగతి ఇంటర్మీడియట్,డిగ్రీ, ఐటిఐ, డిప్లమా పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు జిల్లాలోని నలుమూలల నుండి హాజరయ్యారు. ఉద్యోగంలో జాయిన్ అయిన వారికి 13 వేల నుండి 20,000 వరుకు జీతం ఇవ్వనున్నట్లు స్కిల్ హాబ్ కో అర్డినేటర్ విజయ్ కుమారి అన్నారు. ఈ కార్యక్రమం లో ఏ యం సి చైర్మన్ చేకూరి సుబ్బారావు,మండల అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, మంత్రునాయక్, వేగినాటిశ్రీనివాస్ శనగానారాయణ రెడ్డి, కాలేజీ సిబ్బంది, టిడిపి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేద వితంతువుకు ఇంటిపట్టా అందజేత

**-మాట నిలబెట్టుకున్న జాయింట్ కలెక్టర్**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 20**

ఆమె పేరు మాలపాటి స్వప్న. దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెం గ్రామ నివాసి. వయస్సు 23 ఏళ్లు. ఇద్దరు బిడ్డల తల్లి. పెళ్లయిన ఐదేళ్లకే భర్త ( అనిల్ బాబు )ను కోల్పోయింది. జీవనాధారం లేని తనకు ఉపాధి మార్గం చూపించి ఆదుకోవాలని ఈనెల 17వ తేదీ సోమవారం ప్రకాశం భవనంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు అర్జీ ఇచ్చి వేడుకొంది. ఆమె పరిస్థితిని ఆలకించిన జాయింట్ కలెక్టర్ హృదయం ద్రవించింది. అన్ని విధాలా ఆదుకుంటామని ఆమెకు భరోసా ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు అదే రోజున దర్శి తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఇతర రెవెన్యూ అధికారులు ఆమెకు 25 కేజీల బియ్యం, రెండు కేజీల కందిపప్పు, రెండు కేజీల వంటనూనె, కొంత ఆర్థిక సహాయం అందించారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం ప్రకాశం భవనంలోని తన ఛాంబర్లో బాధిత మహిళలకు జాయింట్ కలెక్టర్ ఇంటి పట్టాను సైతం అందించారు. ఇల్లు కూడా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. వితంతు పెన్షన్ కూడా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరింత ఆర్థిక సాధికారత సాధించేలా జోనోపాధి కోసం నైపుణ్యఅభివృద్ధి శాఖ ద్వారా శిక్షణ కూడా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జీవనాధారం కోల్పోయిన తనకు ప్రభుత్వం తరపున



అండగా నిలిచినందుకు జాయింట్ కలెక్టరుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

**సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి కమిటీ చైర్మన్ ఎం.శోభ**

**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 19**

జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 13వ తేదీన కందుకూరు కోర్టు నందు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నదని జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టవలసిందిగా కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రెవెన్యూ, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, మున్సిపల్ అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయేందుకు చూడాలని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కం మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం శోభ తెలిపారు. కోర్టుల వరకు వెళ్ళని ఫ్రీ లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించు కోవలసినదిగా తెలియజేశారు. కోర్టులోని అన్ని రకముల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భరణం కేసులు, గృహహింస కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, పరిష్కరించబడతాయని ఈ ప్రకటనలో తెలియజేశారు. ఈ అవకాశమును కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవలసినదిగా సీనియర్ సివిల్ జడ్జి గారు తెలిపారు. డిసెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కందుకూరు కోర్టు నందు జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశమును కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకొని కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు.

# నాస్తిక ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ విధానాల వల్ల శబరిమలలో అయ్యప్ప భక్తులకు ఇబ్బందులు



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 20**

పవిత్ర పుణ్యక్షేత్రం అనే గౌరవం లేకుండా, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో కేరళ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని. అయ్యప్ప సేవా సంఘం, అమృతానందమయి మఠం లాంటి ధార్మిక సంస్థలు సేవ చేయకుండా అడ్డుకోవడం ఈ ప్రభుత్వానికి హిందువుల పట్ల ఎంత వ్యతిరేకత ఉంద తెలుస్తుందన్నారు. హిందువుల మనోభావాలను గౌరవించని ఈ ప్రభుత్వం తక్షణం తమ వైఖరిని మార్చుకోవాలని. భక్తుల ఇబ్బందులకు కేరళ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నానని భారతీయ జనతా పార్టీనాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ పేర్కొన్నారు.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 20**

విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సోనియా గాంధీ నగర్, సుజాత నగర్, చెన్నకేశవ మాన్యం, రెవెన్యూ కాలనీ, ఎన్ టి ఆర్ పార్క్కొత్త డొంక, సౌత్ బైపాస్ రోడ్డు, 220 కెవి సబ్‌స్టేషన్, ముంగమూరు రోడ్డు జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి. రంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ఘనంగా గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం





**తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 20:**తాళ్ళపూడి శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ చైర్మన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింహాద్రి జనార్ధనరావు విద్యార్థులకు గ్రంథాలయం అంటే ఒక దేవాలయం, అందరూ ఈ దేవాలయంలో ఉన్న పుస్తకాలను చదివి, జ్ఞానన్ని సంపాదించాలని తెలియపరిచారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తాళ్లపూడి మండల అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాసరావు విద్యార్థులకు గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యతను, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకులను, వారు చేసిన కృషిని గూర్చి వివరించారు. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులు అందరూ కూడా ఈ దశ నుంచి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, జీవితంలో వచ్చే సమస్యను ఎదుర్కోవాలని, నియమ నిబంధనలతో ఆహారం తీసుకుని యోగాతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని వివరించారు. సంస్థ మండల కార్యదర్శి సనపల రాజశేఖర్ విద్యార్థులందరూ కూడా నియమ నిబంధనలతో చదువుకోవాలని, గ్రంథాలయంపై మక్కువ చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి అప్పన వీర హనుమంతరావు గ్రంథాలయం గొప్పతనాన్ని, దానిలో దొరికే పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని వివరించారు. వీరితో పాటు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు విద్యార్థులకు సందేశం ఇచ్చారు. అదేవిధంగా శ్రీ విజేత హై స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ గ్రంథాలయంపై ఒక కవితను విద్యార్థులకు వినిపించి ఆనందపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలలో వారోత్సవాలలో నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంధాలయ అధికారి ఏ.నరేష్ వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా శాంతి ర్యాలీ కమిటీ కన్వీనర్ గెద్దం సాయిబాబా, మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ అంకెం సురేష్, రిటైర్డ్ ఎం.ఈ.ఓ, గ్రంధాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సిహెచ్.ఆంజనేయులు, తాళ్లపూడి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది, చదువరులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రత ల పరిరక్షణ లక్ష్యం.

ఏలూరు రేంజ్ ఐ జి అశోక్ కుమార్ .



**మండపేట. పెన్ పవర్.నవంబర్ 20 :** శాంతి భద్రత లు పర్యవేక్షణ కు కృషి చేస్తామని ఏలూరు రేంజ్ ఐ జి అశోక్ కుమార్ స్పష్టం చేశారు. మండపేట రూరల్ సి ఐ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఐజి ద్రాక్షారామం, రామచంద్రాపురం, మండపేట రూరల్ సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు రూరల్ సి ఐ దొర రాజు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత ప్రధాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ నిరోధక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా,రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దొరరాజు,అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దారం సురేష్ ఇతర స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమం రావాలి

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ నవంబర్ 20**

పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ ను నిర్మించుకోవడంలో ఆంధ్రులకు ఆనాటి ఆంధ్ర మహాసభ – జై ఆంధ్ర ఉద్యమ స్ఫూర్తితో ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమానికి నేటి ఆంధ్ర యువత, ప్రజలు సంసిద్ధం కావాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.

ఈ ఉద్యమంతో విభజన తర్వాత అన్ని రంగాల్లో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ను సంస్కరించుకుందామని అన్నారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉద్యమంలో, మేధావులు, విద్యార్థులు,యువత, విశ్రాంత ఉద్యోగులు , సామాజికవేత్తలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, వైద్యులు , పట్టభద్రులు ప్రత్యక్ష కార్యాచరణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను సిద్ధం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని అర్పిసి అధ్యక్షులు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా – వైద్య దోపిడికి అడ్డుకట్ట వేద్దామని, ప్రజలకు రక్షణగా పనిచేద్దమన్నారు. ఆంధ్రప్రదేశ్ కు కొంతమంది సినిమా వారు శాపంగా మారరని శ్రీనివాస్ ఆవేదన చెందారు.

దేశంలోనే సంపన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పెత్తందారి రాజకీయ కాలుష్యంతో ఆంధ్రప్రదేశ్ విలవిలలాడు తుందని పేర్కొన్నారు. అనాలోచితంగా కొన్ని కుల ఉద్యమాలు తీవ్ర నష్టం కలిగిస్తు న్నాయిని, కుల ఉద్యమ నేతలు సొంత కులాల వారిని కలుపుకోవడం లేదని ఆరోపించారు. ఈ తరహా రాజకీయ కాలుష్యానికి తెలుగు సినీ పరిశ్రమ నుంచి రెండు కుటుంబాలు శాపం గా మారారని, కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థల కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అవాస్తవాలను నిజాలుగా సామజిక కాలుష్యానికి కారకులుగా తయారవుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని నేరుగా నాశనం చేస్తున్నది పాలకులు అయితే కారకులు మాత్రం ఆ మీడియా సంస్థలు మాత్రమే నని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ లో విలువైన వనరులు కొన్ని విదేశీ , స్వదేశీ కార్పొరేట్ సంస్థలు దోచుకుపోతున్నాయన్నారు.

ఆంధ్రప్రదేశ్ మేధావులు, యువత , ఆలోచన చేయాలని ఆ మీడియా సంస్థలు,ఆ రెండు సిని, రాజకీయ కుటుంబాలను బహిష్కరిచాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఇన్నాళ్లు కోల్పోయిన భవిష్యత్ ఆంధ్రులకు దక్కుతుందని ఆయన వ్యక్తం చేసారు .

## వైసీపీకి బహిరంగ చర్చ సవాల్ విసిరిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్, నవంబర్ 20:**శెట్టి బలిజలకు వైసీపీ పాలనలో జరిగిన అన్యాయంపై బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్‌ను తీవ్రంగా విమర్శించారు. శెట్టి బలిజల గౌరవాన్ని వైసీపీ అగ్రనేతల కాళ్ల వద్ద తాకట్టు పెట్టిన వ్యక్తి నేడు ఆ వర్గంపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని మంత్రి విమర్శించారు. శెట్టి బలిజలను గౌడ కులంలో చేర్చిన జీవోను చంద్రబాబు పాలనలోనే జారీ చేశారన్న మాజీ మంత్రి వ్యాఖ్యలు అబద్ధం, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని సుభాష్ తీవ్రంగా ఖండించారు.జీవోలు ఎప్పుడు, ఎవరి పాలనలో జారీ అయ్యాయో తేదీలతో రికార్డులు ఉంటాయని తెలియని అజ్ఞానితో చెల్లుబోయిన వ్యాఖ్యలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో శెట్టి బలిజలకు జరిగిన ద్రోహంపై నోరు మెదపని మాజీ మంత్రి, ఇప్పుడు పదవి కోల్పోయిన తర్వాత ప్రేమ చూపించడం గురివింద పూస సామెతను గుర్తుచేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. శెట్టి బలిజల ద్రోహిగా ముద్రపడిన చెల్లుబోయిన, ఆ బురదను తుడుచుకునేందుకు తనపై, ముఖ్య మంత్రి చంద్రబాబు మీద అపవాదులు వేస్తున్నారని చెప్పారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శెట్టి బలిజలకు వచ్చిన ప్రాధాన్యతను సహించలేక అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మండి పడ్డారు.జగన్ వల్ల తాను లబ్ధిపొందానని చెప్పడం చెల్లుబోయినకు సిగ్గు ఉండాలని వ్యాఖ్యానించిన మంత్రి, జగన్ అడ్డంకులు సృష్టించగా చంద్రబాబు, లోకేష్‌లు ఆహ్వానించి తన రాజకీయ ఎదుగుదలకి దారులు తెరిచారని తెలిపారు.తాను ఏ పార్టీలో ఉన్నా శెట్టి బలిజల ఆత్మగౌరవం కోసం పోరాటం కొనసాగుతుందని, చెల్లుబోయిన వేణుగోపాల్‌లా బోడి మల్లయ్యగా మారనని స్పష్టం చేశారు. శెట్టి బలిజలకు సంబంధించి జారీ చేసిన జీవోలపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని, అందుకు మాజీ మంత్రి కూడా సిద్ధంగా రావాలని సవాల్ విసిరారు. కార్తీక వనసమారాధనతో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టి బలిజలు ఐక్యంగా నిలుస్తుండటం చూడలేక చెల్లుబోయిన అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించిన ఆయన,ఇప్పటికైనా శెట్టి బలిజ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పి తమ తప్పులను అంగీకరించాలని సలహా ఇచ్చారు.

## కూటమి ప్రభుత్వం లో అన్నధాత కి మోసం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ధ్వజం

**అల్లవరం,పెన్ పవర్, నవంబర్ 20:**ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రైతు భరోసా పేరు మార్చి అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకు సంవత్సరానికి 20000 రూపాయలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి అన్నదాత కు సుఖం లేకుండా చేస్తుందని, అన్నదాతను ఘోరంగా మోసం చేసిందని దుయ్యబట్టిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం సంవత్సరానికి 20000 చొప్పున రెండు సంవత్సరాలకు 40000 ఇవ్వాల్సి ఉండగా కేవలం 5000 మాత్రమే ఇచ్చి రైతులను తీవ్రంగా మోసం చేసిందని తెలియజేశారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రైతులకు ప్రతి సంవత్సరం 13500 చొప్పున ఐదు సంవత్సరాలలో ప్రతి రైతుకు 67 వేల 5 వందల రూపాయలు ఇవ్వడం ద్వారా 5 సంవత్సరాలకు 34, 378 కోట్లు ఖర్చు చేసిందని,అలాగే ప్రతి రైతుకు ఉచిత పంట బీమా పథకం వర్తింప చేసిందని,కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింప చేసిందని, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ క్షేత్ర అధికారులను నియమించి భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ప్రతిక్షణం అండగా జగనన్న ప్రభుత్వం ఉందని, పంటకు అవసరమైన పరికరాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 7 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఎగనామం పెట్టిందని, ఉచిత బీమా పథకం ఎత్తివేసిందని, ఇప్పటివరకు ప్రతి రైతుకు 40000 జమ చేయవలసింది ఫోను 5000 రూపాయలు మాత్రమే ఇచ్చిందని తద్వారా ప్రతి రైతును మోసం చేసిందని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రాలు పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయని, సకాలంలో పంట నష్టం కూడా చెల్లించడం లేదని తెలియజేశారు. తక్షణమే రైతులకు బకాయి ఉన్న 16,746 కోట్లు విడుదల చేసి రైతులకు పెట్టుబడి సాయం అందించాలని లేనిపక్షంలో వైఎస్ఆర్సిపి పార్టీ తరపున రైతులకు అండగా రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపడతామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## ప్రభుత్వ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలి






కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం పెన్ పవర్, నవంబర్ 20:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కమిషనర్ రాహుల్ మీనా కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు బ్యాంకర్లు, మెప్మా సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర కీలకమన్నారు. పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలన్నారు. పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారస్తులకు రుణాలను అందించేందుకు బ్యాంకర్లు శ్రద్ధ చూపాలన్నారు. నగర పరిధిలో రూ.15 వేలు, రూ. 25 వేలు, రూ. 50 వేలు రుణాల కోసం పెట్టుకున్న 2,058 పీఎం స్వనిధి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీటిని వారంలోగా పరిష్కరించి రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు సూచించారు. నగరపాలక సంస్థ టిడ్కో గృహాలు కేటాయించిన లబ్దిదారులకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపి రుణాల మంజూరు వేగవంతం చేయాలని కోరారు. కొంత మంది లబ్దిదారులకు సాంకేతిక కారణాలతో రుణాల మంజూరు నిలిపివేశారని, అవి కూడా పునః పరిశీలన చేసి రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయం మేరకు ప్రతి ఇంటికి ఒక మహిళా పారిశ్రామికవేత్త ఆవిర్భవించేలా బ్యాంకర్లుక్రాస్ కృషి చేయాలని కమిషనర్ అన్నారు. మహిళల యూనిట్ల స్థాపనకు బ్యాంకుల రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్, మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ టి.కనకరాజు, సీఎంఎం రామలక్ష్మి, అన్ని శాఖల బ్యాంకు మేనేజర్లు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణసభను జయప్రదంచేయండి.



**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.20:** ఈనెల 24వ.తేదీన చింతూరులో జరగబోవు అమరవీరుల సంస్మరణసభను జయప్రదంచేయాలని మండలంలోనిరేఖపల్లి సెంటర్,లోఅమరవీరుల స్థూపం వద్ద గురువారం సిపిఎంపార్టీ జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు సున్నంరాజులు పార్టీ జెండాను ఆవిష్కరణ చేసి,ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.తదుపరి శ్రీరామగిరి గ్రామంలోని జిల్లా కమిటీసభ్యులు సోయంచిన్నబాబు జండాఆవిష్కరించారు.చొక్కనపల్లి,మ్మొద్దులగూడెం,జీడిగుప్ప, తదితరగ్రామాల్లో నాయకులు జెండాఆవిష్కరణ చేయడం జరిగింది.చొక్కనపల్లి గ్రామం శాఖ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ మన్యంలో ఎక్కడ చూసినా ఆదివాసీ ప్రజలపై అంతులేని దోపిడీ,వెట్టి చాకిరీ,మేకలపుల్లరి మొదలైనదందాలు, పోలీసులు,ఫారెస్టు,రెవెన్యూలాంటి ప్రభుత్వశాఖలు కూడా ఊర్ల మీద పడి లూఠీలు చేసేవారు.తునికాకు మొదలు కొని అనేక అటవీ ఉత్పత్తులను సేకరిస్తే కాంట్రాక్టర్లు దోపిడీ చేసేవారు.సంతల్లోఇక చెప్పనక్కర్లేదు.పాఠశాలలు వైద్యశాలలు,అంగన్వాడీ సెంటర్లు,త్రాగునీరు,రహదారులు విద్యుత్తు,లాంటి సదుపాయాలు ఎక్కడా ఉండేవి కావు. సాగులోఉన్న భూములకు పట్టాలుకూడా ఉండేవి.కావు. మన ఎర్రజెండాతో ఆనాటిమన పెద్దలైన అమరవీరులు వచ్చారు.అన్ని దోపిడీ రూపాలపై సమ్మెలు,తిరుగుబాటు చేయించారు.మహిళలను మోసంచేస్తూ,లైంగిక దోపిడీల కు పాల్పడేవారిపై ప్రజాసంఘాలు ప్రజలను చైతన్యం చేశాయి అని అన్నారు.ఈనెల 24వ తేదీన చింతూరులో జరిగే అమరవీరుల సంస్మరణసభను అధికసంఖ్యలో పాల్గొని,జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని,ఎంపీటీసీ పూనెంప్రదీప్ కుమార్,పంకుసత్తిబాబు,పోడియం శ్రీరామ్మూర్తి,తోడంరాజు,కొండారెడ్డి,సీరపు.తాతబాబు, కమ్మ చిచ్చు సత్యనారాయణ,గొంది ధారయ్య,గుండె పూడి లక్ష్మణరావు,ఖాదర్,ఆత్మకూర్ కాంతారావు, నేరిపోయిన రాజు,వీర్ల.నాగేశ్వరరావు,నాలారపు.ప్రకాష్ రావు,జంగం.మాధవరావు,ప్రజానాట్యమండలి నాయకులుసుబ్బారావు,జంగంమోహన్ రావు,దారోగి బాబురావు,కళ్లిగణేష్,రవి,తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు





**పెద్దాపురం, పెన్ పవర్, నవంబర్ 20 :** పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలోని స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు, మహారాణి కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులందరూ గ్రంథాలయాన్ని వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. గ్రంథాలయాలు మానవజీవితాన్ని ఎలా తీర్చిదిద్దుతాయో, పుస్తకపఠనం ఎంత అవసరమో, పుస్తకపఠనమే తమ జీవితాల్ని ఇలా ఉన్నత శిఖరాలకు చేర్చిందని తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా కళాశాల, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గోమాడ వీరబాబు, మామిడి ఈశ్వరరావు, చెరుకూరి రవికృష్ణ, కోయన ధర్మారావు, రంధి సత్యన్నారాయణ, యాళ్ళ వీరబాబు, పాలమరశెట్టి సత్తిబాబు, లక్ష్మణ్ దివాకర్, మార్ని చిన్న, ఒబిలిశెట్టి గణేష్, అనివిళ్ళ శాస్త్రి, డాక్టర్ తాళాబత్తుల సాయి, తూతిక రాజు, కొరిపూరి రాజు, రాళ్ళపల్లి వెంకటేశ్వరరావు, డి.వి.ఎస్. రామకృష్ణ, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి పై ఫోక్సో కేసు నమోదు

**సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 20:**బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై సీతానగరం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు.మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలికను అదే ప్రాంతానికి చెందిన యువకుడు పుట్ట వెంకట తేజ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు అతడి ఆగడాలు భరించలేక ఆ బాలికఈ విషయం తల్లిదండ్రులకు తెలిపింది. తల్లిదండ్రులు యువకుడిని తన ప్రవర్తన మార్చుకొమ్మని పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీతానగరం ఎస్సై డి. రామ్ కూమార్ యువకుడి పై పోక్స్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## నవంబర్ 23న చెకుముకి సంబరాల జిల్లాస్థాయి పరీక్షలు

**ముసురుమిల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి**




**రంపచోడవరం, పెన్ పవర్, నవంబర్ 20:**రంపచోడవరం మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, ముసురుమిల్లిలో ఈ నెల 23న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక అల్లూరి జిల్లా అధ్యక్ష%–%ప్రధాన కార్యదర్శులు బొజ్జియ్య, కన్నారావు తెలిపారు.మండల స్థాయిలో విజేతలైన 11 ప్రభుత్వ పాఠశాలలు, 3 ప్రైవేట్ పాఠశాలలు సహా మొత్తం 42 మంది విద్యార్థులు ఈ జిల్లాస్థాయి పరీక్షలకు హాజరుకావాలని వారు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం, ప్రతి పాఠశాలకు ఒక జ్ఞాపిక అందజేయనున్నట్లు చెప్పారు.జిల్లాస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి అత్యధిక మార్కులు సాధించిన ఒక్కో జట్టును రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు పరీక్షలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

# పెదపాడు గ్రంథాలయంలో మహిళా సాధికారత పై చర్చా కార్యక్రమం



**ఏలూరు నవంబర్ 20 పెన్ పవర్:** పెదపాడు గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం పెదపాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సందర్భంగా"మహిళా సాధికారత పై చర్చ" నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంనకు జూనియర్ కాలేజీ లెక్చరర్లు కె.సుమతి సివిక్స్,కె.ఉదయలక్ష్మి ఒకేషనల్,కాలేజీ లైబ్రేరియన్ జి. పుల్లయ్య నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులు విద్యార్థినిలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళా విద్యార్థినిలు క్రమశిక్షణ కలిగిన పౌరులుగా మెలగాలని,చెడు అలవాట్లకు పోకుండా, మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని, మహిళలు ప్రతి విషయంలోనూ విజయం సాధించాలని, ఉద్యోగంలో, రాజకీయాలలో, కుటుంబ బాధ్యతలలో మహిళలు సాధికారత సాధించాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేసినారు. అనంతరం జూనియర్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులకు "తుఫానులు – వాటి వలన కలుగు నష్టాలు – తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు గురించి"వ్యాసరచన" మరియు "వక్తృత్వం" పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ పోటీలను డి. విజయలక్ష్మి హిస్టరీ లెక్చరర్,బి.భాను కుమారి ఇంగ్లీష్ లెక్చరర్ నిర్వహించినారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు పర్యవేక్షణలో నిర్వహించడం జరిగినవి. వచ్చిన అతిధులకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియపరిచినారు. పాల్గొనిన విద్యార్థిని విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

## కొత్త వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 20:** ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త వ్యక్తుల పట్ల స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సిఐ వై ఆర్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జగ్గంపేట పరిధిలోని రంగవల్లి నగర్, టవర్ ఏరియా, వాటర్ ట్యాంక్ పరిసరాలను ట్రైనీ ఎస్ఐ రాజు, ఏఎస్ఐ సన్యాసిరావు పోలీస్ సిబ్బంది పరిశీలించారు. డ్రోన్ కెమెరాతో పెట్రోలింగ్ పహార నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు వస్తే అనుమానంగా ఉంటే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 100 లేదా 9440796529 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు.

# కస్టోడియన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి: డీఆర్వో వెంకటరావు



**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 20:**జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లుల్లో విధులు నిర్వహించే కస్టోడియన్ అధికారులతో డీఆర్వో వెంకటరావు నిర్వహించిన సమావేశంలో పలు ముఖ్య సూచనలు చేశారు.రైస్ మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారుల బాధ్యతలు, రైతు సేవ కేంద్రాల నుంచి వచ్చే ధాన్యానికి ఎక్నాలెడ్జ్‌మెంట్ జారీ విధానంపై అవగాహన కల్పించారు.జిల్లాలో 269 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, వీటిని 117 రైస్ మిల్లులకు అనుసంధానం చేసినట్లు డీఆర్వో తెలిపారు. ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ నుంచి రవాణా వరకు ప్రతి దశలో అధికారులు ప్రత్యేక చొరవ చూపి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. రైస్ మిల్లుల్లో ధాన్యం వాహనాలు రద్దీ లేకుండా ఉండేందుకు రెండు షిఫ్టులలో కస్టోడియన్ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. వాహనాలను నిర్ణీత సమయంలో లోడింగ్, అన్‌లోడింగ్ పూర్తి చేసేలా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల డీఎం ఎం దేవులా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణ రాజు, డీఎస్డీటీలు, కస్టోడియన్ అధికారులు పాల్గొన్నారు.

## పోతునూరు సొసైటీలో వెలుగు చూసిన అక్రమాలు

- రూ. లక్షలు హౌసింగ్ రుణాల కుంభకోణం
- మాజీ సొసైటీ అధ్యక్షుడు బుజ్జి పై కేసు నమోదు

**ఏలూరు నవంబర్ 20 పెన్ పవర్ :** దెందులూరు మండలం పోతునూరు భోగేశ్వర స్వామి సొసైటీలో పిల్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు మంజూరులో అక్రమాలు బయటపడ్డాయి. ప్రధాన నిందితుడిగా వైసీపీ నాయకుడు పోతునూరు బుజ్జి పై డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దెందులూరు పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 268/2025 గా కేసు నమోదు అయింది. కేసులో ప్రధాన నిందితుడు అయిన ధూళిపాళ్ల నాగేంద్ర వరప్రసాద్ అలియాస్ బుజ్జిని అదుపులోకి తీసుకుని దెందులూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు.



## కొవ్వలి డిస్పెన్సరీని ఆకస్మిక తనిఖీ చేసిన యానిమల్ హస్బండ్రీ జాయింట్ డైరెక్టర్



**ఏలూరు నవంబర్ 20 పెన్ పవర్ :** దెందులూరు మండలం కొవ్వలి వెటర్నరీ డిస్పెన్సరీని యానిమల్ హస్బండ్రీ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్ రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులకు ఈ సీజన్ లో పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆసుపత్రి వైద్యులు డాక్టర్. హరికృష్ణకు సూచించారు.

## కోనలోవ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అడ్డతీగల ఎంపీడీవో కుమార్..






**అడ్డతీగల, పెన్ పవర్, నవంబర్ 20:**అడ్డతీగల మండలం, కొనలోవ గ్రామ సచివాలయాన్నిగురువారంఉదయం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో సందర్శన సమయంలో ఏఎన్ఎం మరియు అగ్రికల్చర్ అసిస్టెంట్ హాజరు కాలేదు అని ఎంపీడీవో తెలిపారు.గ్రామ సచివాలయంలో నిర్వహించవలసిన 11 రిజిస్టర్లలో అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ మరియు సర్వీస్ చార్జెస్ రిజిస్టర్ 3 మాత్రమే నిర్వహించుచున్నారు అని ఎంపీడీవో కుమార్ తెలిపారు . పోస్టర్స్ కి సంబంధించి ఆధార్ పోస్టర్ డిస్ప్లే చేయటంలేదు అనిఎంపీడీవో తెలిపారు . ప్రతి సచివాలయం సిబ్బంది ఉదయం బయోమెట్రిక్ అటెండెన్స్ వేసి, మూమెంట్ రిజిస్టర్ లో రాసి ఫీల్డ్ విజిట్ చేయలని, ఫీల్డ్ విజిట్ తదనంతరం కార్యాలయానికి వచ్చిఅవుటైం అటెండెన్స్ వెయ్యాలని, ప్రజల నుండి సచివాలయం సిబ్బంది పై ఏ రకమైనపిర్యాదులు రాకుండా చూసుకోవలసినదిగా సిబ్బందికి సూచనలు ఇచ్చారు,చెత్త నుండి సంపద తయారీ కేంద్రం షెడ్ ను పరిశీలించారు. అలాగే గ్రామం లో గల పారిశుధ్యం ఎలా ఉంది అని సచివాలయ సిబ్బంది తో ట్రాన్సిట్ వాక్ నిర్వహించారు. తదనంతరం అంగన్వాడీ కేంద్రం సందర్శించి, పిల్లలకు పెడుతున్న భోజనం మెనూ పరిశీలించి సంతృప్తి చెందారు.ఏఎన్ఎం సబ్–సెంటర్ సందర్శించి, ప్రజలకు వైద్యం సకాలం లో అందుబాటులో ఉండాలని సబ్ సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శించి, విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాలు మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు.

## ఆలయంలో హుండీ దొంగ - 60 వేలుతో పరార్ ప్రయత్నం

- ముద్దాయి అరెస్టు -14 రోజుల రిమాండ్



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్20:**వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం జరిగిన హుండీ లెక్కింపు సమయంలో 60 వేల రూపాయలు దొంగతనం చేసి పారిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని సిబ్బంది రంగేహస్తంగా పట్టుకున్నారు. రామచంద్రాపురం మండలం వేగేయమ్మపేటకు చెందిన వాసంసెట్టి శ్రీనివాసరావు (49) ఆ సమయంలో లెక్కింపు దగ్గర చొరబడి నగదు అపహరించాడు. సంఘటనను గమనించిన ఆలయ ఈ వో నల్లం సూర్య చక్రదర్ రావు సిబ్బందితో కలిసి అతన్ని అదుపులోకి తీసుకుని ఆత్రేయపురం పోలీసులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఎస్ రాము దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు.ముద్దాయిని కొత్తపేట న్యాయస్థానానికి హాజరుపర్చగా, గౌరవ మేజిస్ట్రేట్ జస్వంత్ యాదవ్ 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. అనంతరం అతన్ని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో ఇటువంటి చర్యలకు పాల్పడిన వారెవరినీ విడిచిపెట్టమని, కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదా

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



ఆంధ్రప్రదేశ్ లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మరోసారి తెరపైకి వస్తోంది. ఎన్ని వేల కోట్లు తెచ్చి పోసినా లాభాలు రాకుండా తెల్లఏనుగులా మారితే ఎంత కాలం అని భరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగావ్యాఖ్యానించడం చర్చనీయాంశమవుతోంది. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ముగింపు సమయంలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ప్లాంట్‌ను 'వైట్ ఎలిఫెంట్' అని, ఉద్యోగులు 'ఇంట్లో కూర్చొని జీతాలుతీసుకుంటున్నారు' అని విమర్శించారు. "ప్రభుత్వం ఎప్పటికీ డబ్బు ఇస్తుందా? ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాలు తెచ్చి, ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేయాలి" అని అన్నారు. ఈ మాటలు ప్రైవేటీకరణకు ముందస్తు
సంకేతమా అనే చర్చకు కారణమయ్యాయి.వైజాగ్ స్టీల్ ప్లాంట్ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల్లో మునిగిపోయింది. 2024లో రూ.4,000 కోట్లు నష్టం వచ్చింది. కేంద్రం ఫిబ్రవరి 2025లో రూ.11,440 కోట్లప్యాకేజీ ప్రకటించింది. ప్రైవేటీకరణ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి ఆపేసింది. కేంద్రం రఇచ్చిన ప్యాకేజీతో ప్లాంట్ బతికిందని ఇక ప్రైవేటీకరణ లే లేనట్లేనన్నారు. కానీ ఆ తర్వాత కూడా స్టీల్ ప్లాంట్ పరిస్థితిమెరుగుపడలేదు. ఉద్యోగులు పని చేయడం లేదన్న నివేదికలు ఉండటంతోనే చంద్రబాబు ఇలా వ్యాఖ్యానించారని చెబుతున్నారు. ఆ అనుమానాలను నిజం చేస్తూ.. ఉత్పత్తి ఆధారితంగా జీతాలు చెల్లిస్తామన్న
ఉత్తర్వులు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసింది. నవంబర్ జీతాలు ప్రొడక్షన్ టార్గెట్‌లకు లింక్ చేశారు. ఇది ఉద్యోగుల్లో భయాన్ని మరింత పెంచింది.చంద్రబాబు ప్లాంట్‌ను ప్రొఫెషనల్‌గా నడపాలని కోరుతున్నారు.ఉద్యోగులు కష్టపడాలని చెప్పడం మేనేజ్‌మెంట్ సంస్కరణలకు సంకేతం అనుకోవచ్చు. కేంద్ర ప్యాకేజీతో ప్రైవేటీకరణ ఆగిపోయింది కానీ.. ఎలా ఎప్పటికీ గాడిన పడకుండా.. నష్టాలు వస్తూంటే..ఎప్పటికప్పుడు నిధఉలుతెచ్చి పూడుస్తారని అర్థం కాదని చంద్రబాబు నేరుగా చెబుతున్నారు. ప్రైవేటు కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తూంటే అన్ని వనరులు ఉండి కూడా ఎందుకు స్టీల్ ప్లాంట్ కు లాభాలు రావడం లేదని చంద్రబాబుప్రశ్నిస్తున్నారు. అయితే చంద్రబాబు మాటల్ని విపక్షాలు, యూనియన్లు దీన్ని 'ప్రైవేటీకరణకు మార్గం'గా చూస్తున్నాయి. ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ లేకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని వారంటున్నారు. వాలంటరీ
రిటైర్మెంట్ స్కీమ్ ఉద్యోగులను తొలగించాలనే ప్లాన్ కూడా చేస్తున్నారని ఉద్యోగ సంఘాలు అనుమానిస్తున్నాయి. ప్లాంట్ లాభాల్లోకి వస్తే మాత్రమే ప్రైవేటీకరణ ఆగుతుందన్నట్లుగా చంద్రబాబు మాటలు ఉన్నాయి. అదేపనిగా నష్టాలు వస్తూంటే.. కేంద్రం కూడా నిధులు ఇవ్వదు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ లక్షన్నర కోట్లతో ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వస్తోంది. ఆ కంపెనీ పూర్తి స్థాయి ప్రైవేటు కంపెనీ. ఆ కంపెనీ వస్తే విశాఖస్టీల్ ప్లాంట్ కు మరిన్ని సమస్యలు వస్తాయని భావిస్తున్నారు. ఆ కంపెనీ కోసం స్టీల్ ప్లాంట్ ను నిర్వీర్యం చేస్తారన్న అనుమానాలు కొంత మంది లో వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి సమయంలో ఉద్యోగులు కష్టపడి పనిచేసి లాభాల్లోకి తీసుకు వస్తే.. అప్పుడు ఏమీ చేయలేరని అంటున్నారు. ఇప్పుడు స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవాలంటే అది ఉద్యోగుల్లో చేతుల్లోనే ఉందంటున్నారు.

# హ్యాపీనెస్ట్ హోమ్ మళ్లీ ప్రారంభం

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్టు "హ్యాపీనెస్ట్"కు ముందడుగు పడింది. రాజధాని నిర్మాణంపై కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే చూపిస్తున్న ప్రత్యేకశ్రద్ధతో ఈ పనులు ఊపందుకోనున్నాయి. సీఆర్డీఏ అధికారులు ఇచ్చిన తాజా వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాలు వచ్చే సంవత్సరం జనవరి నుంచి జెట్ స్పీడ్‌లో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికేఅక్టోబర్ 2025 నాటికే పైల్ ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి, మెయిన్ స్ట్రక్చర్ నిర్మాణానికి పునాదులు పడ్డాయి.హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు చరిత్రను పరిశీలిస్తే, 2017-18 కాలంలో ప్రకటించారు. అప్పట్లో మధ్యతరగతిప్రజలకు అత్యంత అద్భుతమైన అవకాశం కావడంతో, ఈ ఫ్లాట్లు "హాట్ కేకుల్లా" అమ్ముడుపోయాయి. భారీగా దరఖాస్తుదారులు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూడా ఈ ఫ్లాట్లను సొంతం చేసుకోవడానికిఉత్సాహపడ్డారు. అయితే, 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని స్థితిపై అనిశ్చితి నెలకొనడంతో ప్రాజెక్టు పూర్తిగా నిలిచిపోయింది. నాటి ప్రభుత్వం దరఖాస్తుదారుల సొమ్ము తిరిగి
ఇచ్చేయాలని నిర్ణయం తీసుకుంది.కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ మొదలు2024 నవంబర్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పునరుజ్జీవనం పోసుకుంది. పాత ప్రాజెక్టును కొనసాగించాలని నిర్ణయం తీసుకున్న సీఆర్డీఏ... ఎన్‌సీసీ సంస్థకు నిర్మాణబాధ్యతలు అప్పగించింది. దీంతో దరఖాస్తుదారుల ఆశలు మళ్లీ చిగురించాయి.ప్రాజెక్టు పరిధి: వివరాలు ఏంటి?హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు దాదాపు 15 ఎకరాల (14.46 ఎకరాలు) విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. ఇది సుమారు ?930 కోట్ల నుంచి ?985 కోట్ల అంచనా వ్యయంతో కూడిన నిర్మాణం.న్న మొత్తం టవర్లు: 12 టవర్లు.న్న అంతస్తులు: ప్రతి టవర్‌లో జీం18 అంతస్తులు (గ్రౌండ్ ఫ్లోర్ ం 18 ఎత్తువైన అంతస్తులు). కొన్ని చోట్ల జీం19 అంతస్తులుగా కూడా ఉన్నాయి.న్న మొత్తం ఫ్లాట్లు: 1,200 ఫ్లాట్లు.ఫ్లాట్‌ల రకాలు: సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి. వివిధ బడ్జెట్‌లలో అందుబాటులో ధరలుఈ ప్రాజెక్టు విభిన్న బడ్జెట్‌ల వ్యక్తులకోసం ఏర్పాటు చేశారు. ధరల వివరాలను సీఆర్డీఏ స్పష్టం చేసింది:ఫ్లాట్ రకం ధర రేంజ్ నిర్మాణ వివరాలుసింగిల్ బెడ్‌రూమ్ రూ.60 లక్షలు నుంచి నిర్ణయించాల్సి ఉందిడబుల్ బెడ్‌రూమ్ రూ.80 లక్షలు నుంచి రూ.1 కోటీ వరకు నిర్ణయించాల్సి ఉందిట్రిపుల్ బెడ్‌రూమ్ రూ.1 కోటీ నుంచి రూ.1.30 కోటీ వరకు చదరపు అడుగుకు రూ.4,751 చొప్పున ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లను చదరపు అడుగుకు రూ.4,751 చొప్పున విక్రయిస్తున్నారు. అమరావతి వంటి ప్రీమియం లొకేషన్‌లో, అందునా రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో, ఈ ధరలు స్థిరమైన నివాసాన్నిఅందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు కేవలం నివాసాలకే పరిమితం కాలేదు. వచ్చే సంవత్సరం మార్చి నాటికి సెక్రెటేరియట్, మంత్రుల కేబిన్‌లు, విభాగ కార్యాలయాలు పూర్తి

**చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు.**

ఐఎస్ సీనియర్ అధికారుల టవర్‌లు వేగంగా నిర్మిస్తున్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్యాంపు కార్యాలయాలు దాదాపు పూర్తయ్యాయి.

జడ్జీ రెసిడెన్సెస్ కూడా పూర్తి కావస్తున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల తరలింపుతో, అమరావతిలో వెంటనే నివాసాల అవసరం పెరగడం ఖాయం. సరిగ్గా ఈ సమయంలోనే 1,200 హ్యాపీనెస్ట్ ఫ్లాట్‌ల నిర్మాణం "జెట్ స్పీడ్"లో పూర్తి చేసి అందించాలనిప్రభుత్వం చూస్తోంది.

# వాసిరెడ్డికి దారేదీ... మూసుకుపోయిన దారులు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

వైసీపీ నుంచి రాజీనామా చేసిన వారిని పార్టీలోకి తీసుకోవడానికి టీడీపీ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వైసీపీ అధికారం కోల్పోయిన వెంటనే మాజీ మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. అయితేఆమె ఇప్పటి వరకూ ఏ పార్టీలోనూ చేరలేదు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు వెంటనే ప్రకటించారు. గత ఏడాది డిసెంబరు నెలలో ఆమె రాజీనామా చేసినప్పటికీ ఇంత వరకూ టీడీపీలో వాసిరెడ్డి పద్మ టీడీపీలోచేరలేదు. డిసెంబరు నెలాఖరులోనే చేరాల్సిన వాసిరెడ్డి పద్మ టీడీపీ లో చేరలేకపోయారు. అయితే వాసిరెడ్డి పద్మ చేరికకు టీడీపీ నేతలు అభ్యంతరం పెద్దయెత్తున చెప్పారని తెలిసింది. వాసిరెడ్డి పద్మ మాటకారి. మంచిసబ్జెక్టు ఉన్న నేతగా పేరు. ప్రజారాజ్యం నుంచి ఆమె పార్టీకి అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ప్రజారాజ్యంలోనూ ఎక్కువ రోజులు ఉండలేదు. తర్వాత ఆమె వైసీపీలో చేరి తన అదృష్టాన్నిపరీక్షించుకోవాలనుకున్నారు. కానీ వైఎస్ జగన్ మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ పదవి వరకే వాసిరెడ్డిని పరిమితం చేశారు. తనకు జగన్ అన్యాయం చేశారని, జగన్ తనకు చాలా బాకీ ఉన్నారని వాసిరెడ్డి పద్మ మీడియాతోపదే పదే చెబుతున్నారు. తాను పదిహేనేళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వలేదని వాసిరెడ్డి పద్మ వాదన. అందుకే తనకు వైసీపీ లో ఎదుగుదల లేదని భావించి తాను పార్టీకి
రాజీనామా చేసి బయటకు వచ్చానని చెబుతున్నారు. జగన్ తనకు రాజకీయంగా అన్యాయం చేశారని వాసిరెడ్డి పద్మ అంటున్నారు. అయితే వైసీపీ నేతలు మాత్రం కేబినెట్ హోదా ఇచ్చినా ఆమెకు అంతకు మించినపదవి కావాలంటే ఎలా? అని వేచి ఉండాలి కదా? అని అంటున్నారు.. కాపు సామాజికవర్గానికి చెందిన వాసిరెడ్డి పద్మ తొలుత జనసేనలో చేరాలనుకున్నారు. అయితే అప్పటికే జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేనిఉదయభాను జనసేనలో చేరతారన్న ప్రచారంతో వాసిరెడ్డి పద్మ ఆ ఆలోచనను మానుకున్నారు. సామినేని జనసేనలో చేరడమే కాదు కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడయ్యారు. దీంతో ఆమె జనసేనలో చేరే ఛాన్స్ లేదు.అందువల్లనే ఆమె టీడీపీలో చేరేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేనిచిన్నిని కలిసి ఆయన ద్వారా పార్టీలో చేరాలని వాసిరెడ్డి భావించారు. మూడు సార్లు కేశినేని చిన్నితోవాసిరెడ్డి పద్మ సమావేశమయ్యారు. కేశినేని చిన్ని కూడా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో మాట్లాడివర్క్ అవుట్ కాలేదని తెలిసింది. మొత్తం మీద వాసిరెడ్డి పద్మ దాదాపు ఏడాదిన్నర కాలంగారాజకీయంగా దూరంగానే ఉంటున్నారు. మరి ఏ పార్టీ కూడా దరిదాపుల్లో చేర్చుకోదేమోనన్న ఆందోళన ఆమెలో కనపడుతుంది

# టిప్పర్ ఢీకొని మహిళ మృతి



**సత్తెనపల్లి:పెన్ పవర్:** సత్తెనపల్లి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్ వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అతి వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో కొటపాటి కృష్ణకుమారి (55) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారనిస్థానికులు తెలిపారు. మృతురాలు సత్తెనపల్లికి చెందిన కృష్ణకుమారిగా పోలీసులు గుర్తించారు. అనంతరం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రెండవ రోజు కొనసాగుతున్న మావోయిస్టు మృతదేహాల పోస్టుమార్టెం

**రంపచోడవరం: పెన్ పవర్:**రంపచోడవరం ఆసుపత్రిలో మావోయిస్టు మృతదేహాల పోస్టుమార్టం బుధవారం ఉదయం కుడా కొనసాగింది. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ రంపచోడవరం చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. బుధవారం హిడ్మా , రాజక్క మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అయింది. మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించారు.భారీ బందోబస్తు మధ్య చత్తీస్గడ్ తరలించారు. గురువారం మిగిలిన 11 మందికి మావోయిస్టు మృతదేహాలకు కొనసాగింది. మృతదేహాల బంధువుల నుంచి డిఎన్ఏ శాంపిల్స్ సేకరించారు.

# పరకామణి కేసు టార్గెట్ కరణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డేనా

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



రెండు కీలక కేసులు. వాటి చుట్టే రచ్చ. తిరుమల శ్రీవారి కొండంత రాజకీయం. అటు పరకామణి చోరీ కేసు..ఇటు కల్తీ నెయ్యి ఇష్యూ..రెండూ పీక్ లెవల్‌కు చేరుకున్నాయి. ఎన్నికలకు ముందు పరకామణి వివాదంరచ్చకెక్కితే..ఎలక్షన్ అయిపోయాక కల్తీ నెయ్యి ఎపిసోడ్ కాక రేపుతూ వస్తోంది. ఫైనల్‌గా రెండు కీలక కేసుల్లో దర్యాప్తు నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటోంది. పరకామణి చోరీ కేసు జఠిలం అవుతోందా? కల్తీ నెయ్యి కేసు లాస్ట్‌స్టేజ్‌లో ఉందా? ఈ రెండు కేసుల్లో ఆ ఇద్దరే టార్గెట్టా?రెండు కీలక కేసుల చుట్టూ కొండంత వివాదం అవుతోంది. అసలే కోట్లాది మంది భక్తులు విశ్వసించే తిరుమల శ్రీవారికి సంబంధించిన ఇష్యూస్. ఒకటి పరకామణి చోరీ కేసు. రెండోది కల్తీ నెయ్యి ఘటన. పరకామణి చోరీ కేసు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పెద్ద వివాదం అయింది. అప్పట్లో అది సెటిల్ అయినా లేటెస్ట్‌గా మూడు నెలల నుంచి పెద్ద చర్చగా కొనసాగుతోంది. పరకామణిచోరీ చేసిన వ్యక్తి ఆస్తుల జప్తు..అతని ఆస్తులపై ఏసీబీ దర్యాప్తు ఇలా రోజుకో డెవలప్‌మెంట్ జరుగుతుండగానే..సాక్షి సీఐ సతీష్ మృతి చెందడంతో కేసు కొత్త టర్న్ తీసుకున్నట్లు అటు సతీష్‌ది ఆత్మహత్య అనివైసీపీ..హత్య అని టీడీపీ డైలాగ్ వార్‌కు దిగుతున్నాయి. టీడీపీ ఓ అడుగు ముందుకేసి వైసీపీ నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డే..సతీష్‌ను చంపించారని కూడా ఆరోపిస్తోంది. ఇంకా పోలీస్ దర్యాప్తు
కొనసాగుతుండగానే..సతీష్ డెత్ మిస్టరీ చుట్టూ రాజకీయం రంకెళ్లు వేస్తోంది.మరోవైపు పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విచారణకు హాజరయ్యేందుకు వెళ్తుండగా సీఐ సతీష్ కుమార్అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో..ఈ కేసులో నిందితుడు రవికుమార్‌తో పాటు సాక్షులకు భద్రత కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణి చోరీ కేసు విచారణ ముగిసే వరకు సాక్ష్యులకు ప్రొటెక్షన్ఇవ్వాలని ఆర్డర్స్ ఇచ్చింది న్యాయస్థానం. అయితే వైసీపీ నేత భూమన కరుణాకరెడ్డి టార్గెట్‌గానే పరకామణి కేసు కొనసాగుతోందన్న టాక్ వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి..టీటీడీపనితీరు బాలేదంటూ పదేపదే మీడియా ముందు వాలిపోతూ ఆరోపణలు, విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే గోశాల, విష్ణుమూర్తి విగ్రహం ఇష్యూలో భూమన టీటీడీపై సీరియస్ అలిగేషన్స్ చేశారు. ఆ తర్వాతఆయనపై కేసులు, నోటీసులు, విచారణ అంటూ హడావుడి నడిచింది.అయితే భూమన ఛైర్మన్‌గా ఉన్న సమయంలోనే పరకామణి కేసును ప్రైవేటు సెటిల్‌మెంట్ చేశారని..నిందితుడు రవికుమార్ ఆస్తుల విషయంలో ఏదో
గోల్‌మాల్ ఉందన్న ఆరోపణలు వ్యక్తం చేస్తోంది టీడీపీ. ఈ క్రమంలోనే సతీష్‌ది ఆత్మహత్య అంటూ భూమన చేసిన వ్యాఖ్యలను కూడా టీడీపీ అస్త్రంగా వాడుకుంటుంది. సతీష్‌ది హత్యా? ఆత్మహత్యా? లేక ఆకస్మికమరణమా అని పోలీసులు తేల్చకముందే ఆత్మహత్య అని భూమన ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నిస్తోంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా పరకామణి కేసుపై రియాక్ట్ అయ్యారు. పరకామణి కేసునునిష్పక్షపాతంగా విచారించాలని ప్రభుత్వానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు.ఇక తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై కూడా ఇప్పటికీ తీవ్ర దుమారం నడుస్తూనే ఉంది. గత ఎన్నికల తర్వాతవెలుగులోకి వచ్చిన కల్తీ నెయ్యి కేసు ఇప్పటికీ కాక రేపుతోంది. ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ అప్పన్న అరెస్ట్ అయ్యాడు. ఆయనను కస్టడీకి తీసుకుని సిట్ విచారించింది. వైవీతో సంబంధం ఎలా ఏర్పడింది?తిరుమల వ్యవహారాలతో మీకేం పని? అంటూ ఆరా తీసినట్లు తెలుస్తోంది. అప్పన్న బ్యాంకు ఖాతాలో రూ. 4.69 కోట్లు ఎలా జమయ్యాయని ప్రశ్నించినట్లు టాక్.తిరుమలకు నెయ్యి సప్లై..ఆర్డర్స్..వాటితో వైవీసుబ్బారెడ్డికి ఏమైనా ప్రమేయం ఉందా అని కూపీ లాగారాట. ఇక ఇప్పటికే అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డిని సిట్ విచారించింది. ఈ క్రమంలోనే వైవీ సుబ్బారెడ్డికి కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. అనారోగ్యంగా ఉన్నట్లువైవీ.. అధికారులకు ఇన్ఫామ్ చేయడంతో..సిట్ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికే వెళ్లి విచారించాలని నిర్ణయించారు. సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి ఏం చెప్పబోతున్నారు? ఆయన పీఏ చెప్పిన
విషయాలపై సిట్ ఎలాంటి ప్రశ్నలు వేయనుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఉందని తేలితే మాత్రం ఈ కేసులో సంచలనాలు పక్కా. కల్తీ నెయ్యి వివాదంపై ఇప్పటికే కూటమి, వైసీపీమధ్య మాటల యుద్ధం సాగుతోంది.అయితే అటు పరకామణి కేసులో భూమన..ఇటు కల్తీ నెయ్యి కేసులో వైవీ సుబ్బారెడ్డి అలిగేషన్స్ ఎదుర్కొంటుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. పైగా ఈ ఇద్దరు నేతలు వైసీపీఅధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. ఈ ఇద్దరిని కార్నర్ చేసి..జగన్‌ను ఇరకాటంలో పెట్టేందుకు కూటమి స్కెచ్ వేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. పరకామణి కేసు..ఇటు
కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో రాబోయే రోజుల్లో ఎలాంటి డెవలప్‌మెంట్స్ ఉంటాయో చూడాలి.

# కామ్ గా మారిన గీత...

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

వైసీపీ నేత వంగా గీత ఎందుకో యాక్టివ్ గా లేరు. ఫైర్ బ్రాండ్ గా ముద్రపడిన వంగా గీత ఇప్పుడు రాజకీయంగా కామ్ అయిపోయారు. గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి
పాలయ్యారు. అక్కడ పవన్ కల్యాణ్ బరిలో ఉండటంతో వంగా గీతను పిఠాపురం ప్రజలు ఆదరించలేదు. నాడు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తాము అధికారంలోకి వస్తే వంగా గీతను ఉప ముఖ్యమంత్రి పదవిని కూడాచేస్తానని హామీ ఇచ్చినా వర్క్ అవుట్ కాలేదు. 2024 ఎన్నికల్లో దారుణ ఓటమి తర్వాత వంగా గీత పెద్దగా కనిపించడం లేదు. అప్పడప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మినహా పూర్తిస్థాయిలో యాక్టివ్ గా లేరన్నదివాస్తవం. 2019 ఎన్నికల్లో వంగా గీత కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఐదేళ్లు బాగానే ఉన్నారు. అయితే ఆమెకు పార్లమెంటు కంటే శాసనసభలోకిప్రవేశించాలన్న మక్కువే ఎక్కువ ఉంది. జగన్ కూడా పిఠాపురం నియోజకవర్గం కేటాయించడంతో పవన్ కల్యాణ్ తో హోరాహోరీ పోరాడారు. కానీ అవతల ఉన్నది పవన్ కల్యాణ్ కావడం, ఆయనఅభిమానులు, సామాజికవర్గం ఓటర్లు పవన్ కు పక్కాగా ఓటేయడంతో వంగా గీత దారుణంగా ఓటమి పాలయ్యారు. ఇక పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని తన అడ్డాగా మార్చుకున్నారు. ఆయన వచ్చే ప్రతిఎన్నికల్లోనూ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతారు.. పవన్ కల్యాణ్ పై పోటీ చేసి గెలుపొందడం కష్టమేనని భావిస్తున్న వంగా గీత తనకు వేరే నియోజకవర్గాన్ని అప్పగిస్తే బాగుంటుందన్నఅభిప్రాయంలో
ఉన్నట్లుకనపడుతుంది. ఇక్కడ మళ్లీ పవన్ పై పోటీ చేసినా గెలుపు అనేది చాలా వరకూ కష్టమే కావడంతో ఆమె మరొక నియోజకవర్గానికి షిఫ్ట్ అవ్వాలని భావిస్తున్నారు. కానీ జగన్ నుంచి ఇప్పటి వరకూ దీనిపై క్లారిటీ
రాకపోవడంతో వంగా గీత యాక్టివ్ గా లేరంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి తాను తప్పు చేశానా? అన్న అంతర్మథనంలో వంగా గీత ఉన్నట్లు తెలుస్తోంది. వంగా గీత
పిఠాపురంలోనూ పెద్దగా యాక్టివ్ గా లేకపోవడానికి ఇదే ప్రధాన కారణమని చెబుతున్నారు.

# పాకిస్తాన్ క్రికెటర్‌తో హర్భజన్ సింగ్ షేక్ హ్యాండ్.. నెటిజన్స్ విమర్శలు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ విమర్శలకు గురవుతున్నాడు. పాకిస్తాన్ క్రికెటర్ షానవాజ్ దహానీతో షేక్ హ్యాండ్ ఇవ్వడమే ఇందుకు కారణం. హర్భజన్ ప్రస్తుతం అబుదాబి T10 లీగ్‌లో ఆస్పిన్ స్టాలియన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. చివరి ఓవర్‌లో ఆస్పిన్ స్టాలియన్స్ కు ఎనిమిది పరుగులు అవసరం. ఈ దశలో పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ దహానీ అద్భుతంగా బౌలింగ్ చేసి జట్టు నార్తర్న్ వారియర్స్ కు విజయాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత హర్భజన్ సింగ్ పాకిస్తాన్ క్రికెటర్ దహానీతో షేక్ హ్యాండ్ ఇచ్చిన వీడియో వైరల్ అవుతోంది. 2025 ఆసియా కప్ క్రికెట్ లో భారత ప్లేయర్స్ పాకిస్థాన్ జట్టుకు షేక్ హ్యాండ్ ఇవ్వని సంగతి తెలిసిందే. మూడు మ్యాచ్ లు ఆడినప్పటికీ ఒక్క మ్యాచ్ లో కూడా షేక్ హ్యాండ్ ఇవ్వకుండా పాకిస్థాన్ ను దూరం పెట్టారు. ఆ తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు కూడా మెన్స్ నే ఫాలో అయింది. భారత్ వేదికగా జరిగిన వరల్డ్ కప్ లో పాకిస్థాన్ మహిళలకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. అయితే హర్భజన్ మాత్రం షేక్ హ్యాండ్ ఇవ్వడంతో నెటిజన్స్ ఈ సీనియర్ ప్లేయర్ పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ ఫైనల్‌లో భారత లెజెండ్స్.. పాకిస్తాన్ లెజెండ్స్‌తో మ్యాచ్ ఆడడానికి నిరాకరించింది. ఈ టీంలో హర్భజన్ కూడా ఉన్నాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఆస్పిన్ స్టాలియన్స్ పై నార్తర్న్ వారియర్స్ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన నార్తర్న్ వారియర్స్ నిర్ణీత 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ఆస్పిన్ స్టాలియన్స్ 10 ఓవర్లలో 110 పరుగులు చేసి ఓడిపోయింది. చివరి ఓవర్ వరకు మ్యాచ్ ఆస్పిన్ స్టాలియన్స్ చేతిలోనే ఉంది. అయితే చివరి ఓవర్లో దహానీ.. హర్భజన్ సింగ్ వికెట్ తో సహా మూడు వికెట్లు పడగొట్టి వారియర్స్ కు విజయాన్ని అందించాడు. దహానీకి (2/10)కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# ఐపీఎల్ వేలం ఆపేయండి: వేలం, లీగ్ మార్పుపై రాబిన్ ఊతప్ప కీలక సూచనలు

- ఐపీఎల్‌లో వేలం ప్రక్రియను తొలగించాలన్న రాబిన్ ఊతప్ప
- ఏడాది పొడవునా ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి వీలు కల్పించాలన్న ఊతప్ప
- రెండున్నర నెలల లీగ్ నుంచి ఆరు నెలల లీగ్‌గా మార్చాలని సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ వేలంపై మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌ను ఆరు నెలల లీగ్‌గా మార్చాలని ఆయన సూచించాడు. మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేయాలని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో వేలం ప్రక్రియను తొలగించి, ఏడాది పొడవునా ఆటగాళ్లను కొనుగోలు చేసుకోవడానికి వీలు కల్పించి, డ్రాఫ్ట్ సిస్టమ్‌కు మార్చాలని ఆయన అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌ను రెండున్నర నెలల లీగ్ నుంచి ఆరు నెలల లీగ్‌గా మార్చాలని సూచించాడు. ఐపీఎల్‌ను స్టార్టప్ దశకు మించి తీసుకు వెళ్లడం లేదని ఆయన వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ ప్రపంచంలోనే అగ్రగామి క్రికెట్ లీగ్ అని, మారుతున్న కాలానికి తగినట్లుగా ఆలోచనలు చేయాలని అన్నాడు. వేలం ప్రక్రియను నిలిపివేసి, సంవత్సరం పొడవునా ట్రేడ్ విండోను తెరిచి ఉంచాలని సూచించాడు. వేలం పద్ధతిని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలని అన్నాడు. తాను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయాన్ని చెబుతూనే ఉన్నానని ఆయన గుర్తు చేశాడు. వారు టీవీ వినోదం గురించి మాత్రమే




ఆలోచిస్తున్నట్లుగా ఉందని, డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పదని ఆయన అన్నాడు. ఇది అభిమానులను తప్పకుండా ఆకట్టుకుంటుందని, దీనిని అమలు చేయాలని సూచించాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఉండవచ్చని, కానీ ఐపీఎల్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించాడు.

# చరిత్ర సృష్టించిన ముష్ఫికర్ రహీమ్.. బంగ్లాదేశ్ నుంచి తొలి క్రికెటర్‌గా ఘనత

- వందో టెస్టులో శతకంతో మెరిసిన ముష్ఫికర్ రహీమ్
- ఐర్లాండ్‌తో జరుగుతున్న టెస్టులో అరుదైన ఘనత
- ఈ రికార్డు సాధించిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్
- ప్రపంచంలో ఈ ఫీట్ అందుకున్న 11వ ఆటగాడిగా రికార్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ సీనియర్ క్రికెటర్, వికెట్ కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ తన కెరీర్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. తన వందో టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ఐర్లాండ్‌తో మిర్పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. రెండో రోజు ఆటలో 106 పరుగుల వద్ద ఔటైన ముష్ఫికర్, వందో టెస్టులో శతకం బాదిన తొలి బంగ్లాదేశ్ ఆటగాడిగా, ప్రపంచంలో 11వ క్రికెటర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 99 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలిచిన ముష్ఫికర్, రెండో రోజు తన శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. తర్వాతి ఓవర్‌లో సింగిల్ తీసి సెంచరీ మార్క్ అందుకోగానే స్టేడియం మొత్తం హర్షాతిరేకాలతో మార్మోగింది. అతను నెమ్మదిగా ఆడతాడని, కచ్చితంగా సెంచరీ చేస్తాడని బంగ్లా మాజీ కెప్టెన్ మోమినుల్ హక్ ముందురోజే చెప్పిన మాట నిజమైంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా కేవలం 10 మంది మాత్రమే తమ వందో టెస్టులో సెంచరీ చేయగలిగారు. ఆస్ట్రేలియా ఆటగాడు డేవిడ్ వార్నర్ 2022లో దక్షిణాఫ్రికాపై ఈ ఘనత సాధించగా, ఇప్పుడు ముష్ఫికర్ ఆ జాబితాలో చేరాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ తన వందో టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు చేయడం విశేషం. జో రూట్, హషీమ్ ఆమ్లా, ఇంజమామ్ ఉల్ హక్, జావేద్ మియాందాద్ వంటి దిగ్గజాలు ఈ జాబితాలో ఉన్నారు. అయితే, ఇప్పటివరకు ఒక్క భారత ఆటగాడు కూడా ఈ రికార్డును అందుకోలేకపోవడం గమనార్హం.

గ్లామరస్ ఈవెంట్‌లో క్రిస్టల్-అలంకరించిన గౌనులో అవ్నీత్ కౌర్ స్టన్స్



# గ్లోబల్ ప్లాన్ లో నాని బిగ్ స్టెప్



‘దసరా’ సినిమాతో తనలోని మాస్ యాంగిల్ ను పరిచయం చేసిన నేచురల్ స్టార్ నాని, ఇప్పుడు తన టార్గెట్ ను మరింత పెంచేశాడు. కేవలం పాన్ ఇండియా స్టార్ గా మిగిలిపోకుండా, గ్లోబల్ బాక్సాఫీస్ ను టచ్ చేయాలనే కసి అతనిలో కనిపిస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ‘ది ప్యారడైజ్’ సినిమా కోసం నాని వేస్తున్న ప్లాన్స్ చూస్తుంటే, టాలీవుడ్ నుంచి మరో అంతర్జాతీయ స్థాయి సినిమా రాబోతోందనిపిస్తోంది.

ఈ సినిమాను నాని కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఎస్ ఎల్ వి సినిమాస్ అధినేత సుధాకర్ చెరుకూరి ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు చేస్తున్నారు. అయితే పెట్టిన బడ్జెట్ వెనక్కి రావాలంటే కేవలం మన మార్కెట్ సరిపోదు. అందుకే సినిమాను ఇంటర్నేషనల్ ఆడియన్స్ కు రీచ్ అయ్యేలా ప్రమోట్ చేయాలని టీమ్ డిసైడ్ అయ్యిందట. కథలో ఉన్న ఎమోషన్, రా యాక్షన్ యూనివర్సల్ గా అందరికీ కనెక్ట్ అవుతుందని నాని బలంగా నమ్ముతున్నారు.

దీనికోసం ఒక సరికొత్త ప్రమోషనల్ స్ట్రాటజీని సిద్ధం చేస్తున్నారు. లోకల్ మీడియాకే పరిమితం కాకుండా, ఇంటర్నేషనల్ మీడియాను, పాపులర్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఆహ్వానించాలనే ఆలోచనలో ఉన్నారు. వారికి స్పెషల్ గా సినిమాలోని కొన్ని హై ఆక్టేన్ సీన్స్, మేకింగ్ వీడియోలు చూపించి, వెస్ట్ లో బజ్ క్రియేట్ చేయాలనేది ప్లాన్.

అంతేకాదు, ఈ సినిమా కోసం ఏకంగా హాలీవుడ్ స్టార్ ‘రయాన్ రెనాల్డ్స్’ పేరును తెరపైకి తీసుకురావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సినిమాను గ్లోబల్ గా ప్రెజెంట్ చేయడానికి లేదా ప్రమోషన్స్ లో భాగం చేయడానికి నాని టీమ్ ఆయన్ను సంప్రదించిందట. ఈ డీల్ ఇంకా ఓకే అవ్వకపోయినా, అసలు నాని టీమ్ ఆలోచనలే హాలీవుడ్ రేంజ్ లో ఉన్నాయని దీన్ని బట్టి అర్థమవుతోంది.

రీసెంట్ గా రిలీజైన ‘స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్’ గ్లింప్స్ చూస్తే ఆ క్వాలిటీ ఏంటో అర్థమవుతుంది. అనిరుధ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, శ్రీకాంత్ ఓదెల టేకింగ్ హాలీవుడ్ యాక్షన్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి. కంటెంట్ లో ఆ దమ్ము ఉంది కాబట్టే, నాని ఇంత పెద్ద రిస్క్ చేయడానికి ధైర్యం చేస్తున్నాడు. మొత్తానికి ‘ది ప్యారడైజ్’ ఇప్పుడు కేవలం ఒక తెలుగు సినిమా కాదు, అదొక గ్లోబల్ ప్రాజెక్ట్. మార్చి 26, 2026న రిలీజ్ కానున్న ఈ సినిమా కోసం చేస్తున్న ఈ ప్రయత్నాలు ఫలిస్తే, నాని రేంజ్ ఊహించని స్థాయికి వెళ్లడం ఖాయం. మరి ఈ ‘గ్లోబల్ స్కెచ్’ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.



ఐశ్వర్య మీనన్ యొక్క తాజా బ్రౌన్ దుస్తుల ఆన్‌లైన్‌లో హృదయాలను గెలుచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com